ప్రజాశక్తి

గురువారం 03 ఆగస్టు 2023

5

కర్నూలు





నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

కదిలింది అరుణసైన్యం

- సమగ్రాభివృద్ధికి సిపిఎం మహా పాదయాత్ర - హక్కుల కోసం పోరాడాలి - సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/ఆదోని/ఆదోని రూరల్

జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఆదోని నుంచి కర్నూలు వరకూ చేపట్టనున్న సిపిఎం మహా పాదయాత్ర బుధవారం ఆదోనిలో అత్యంత ఉత్సాహంగా ప్రారంభమైంది. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. ఆదోని పుర వీధుల్లో పాదయాత్రకు విశేష స్పందన లభించింది. ఆదోని పాతబస్టాండ్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర భీమాస్ కూడలి, ఎమ్మిగనూరు కూడలి, తిక్కస్వామి దర్గా, ఆర్ట్స్ కళాశాల, బైచిగేరి క్రాస్, ఆరేకల్ మీదుగా బనవాసి ఫారం వరకు సాగింది. ఎర్రజెండా చేతబూని నినాదాలతో విధులన్నింటినీ హోరెత్తించారు. ఒక్కసారిగా వరదలాదిమంది జెండాలు చేతబూని కదలడంతో 'ఎన్నాళ్లకు ఇంత పెద్ద ఊరేగింపు' అంటూ జనాలంతా ఎంతో ఆసక్తిగా తిలకించారు. పాదయాత్ర ప్రారంభం సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సభలో గఫూర్ మాట్లాడారు. మన హక్కులను కాపాడుకోవడం మన బాధ్యత అని, ఆ బాధ్యతను గుర్తు చేయడానికే ఈ పాదయాత్ర అని తెలిపారు. అధికారం కోసం చాలామంది పాదయాత్రలు చేస్తుంటారని, ఈ పాదయాత్ర అధికారం కోసం కాదని, అభివృద్ధే లక్ష్యమని చెప్పారు. రాష్ట్ర, జిల్లా విభజన తర్వాత కర్నూలు జిల్లా వెనుకబడి ఉందని తెలిపారు. కర్నూలు జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వ అజెండా ఏమిటని ప్రశ్నించారు. జిల్లాకు సాగు, తాగునీరు ఇచ్చే వరకు పోరాటం సాగిస్తామని, ఈ పోరాటాన్ని అందరూ బలపరచాలని కోరారు. వాటాలో సగం నీళ్లు కూడా మనకు రావడం లేదన్నారు. ఈ ప్రాంత విద్య, ఉపాధి కోసం ఎవరూ ఆలోచించడం లేదన్నారు. అమరావతితో పాటు అన్ని ప్రాంతాల అభివృద్ధి ప్రభుత్వాల బాధ్యత అన్నారు. ప్రజల గురించి ఆలోచించే పరిస్థితిలో జగన్ లేరని, ప్రజల సొమ్మును కొల్లగొట్టడానికా ఎమ్మెల్యేలు ఉందని ప్రశ్నించారు.

ప్రజలు ప్రశ్నించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్

ఎన్నికల సందర్భంగా నాయకులు అనేక వాగ్దానాలు చేసే ప్రయత్నాలు చేస్తారని, సాగునీరు, ఉపాధి వంటి వాటి కోసం ప్రజలు ప్రశ్నించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ తెలిపారు.



పట్టణంలో పాదయాత్ర నిర్వహిస్తున్న నాయకులు

జిల్లాలో అనేక సమస్యలు ఉన్నాయని, రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన జిల్లాగా కర్నూలు ఉందని తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం అన్ని రంగాల్లో జిల్లా వెనుకబడి ఉందన్నారు. రాష్ట్రానికి మొదటి రాజధాని అభివృద్ధికి నోచుకోవడం లేదని, ప్రాజెక్టులను ఎవరూ పూర్తి చేయడం లేదని అన్నారు. జిల్లా యువత ఊళ్లు వదిలి వెళ్లి ఉద్యోగాలు చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాదయాత్రకు మద్దతు...

పాదయాత్రకు సిపిఐ, కాంగ్రెస్, ఆర్‌సిసి నాయకులు మద్దతు తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య మాట్లాడుతూ... పాదయాత్ర విజయవంతం కావడానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకోకపోవడంతో చాలా వెనుకబడి ఉందన్నారు. పోరాటానికి ఇది మంచి సమయమన్నారు. ఇప్పటికైనా జిల్లా సమగ్రాభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని, సాగునీటి ప్రాజెక్టులు కట్టాలని, పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఆదోని ఇన్‌ఛార్జీ ప్రకాష్ మాట్లాడుతూ... రైతులు, కార్మికులు, ప్రజల కోసం కమ్యూనిస్టులు పోరాడుతున్నారన్నారు. ఉన్న ప్రాజెక్టులు పట్టించుకోని ప్రభుత్వాలు ఎందుకని ప్రశ్నించారు. పాదయాత్రకు సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఆర్‌సిసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ... ఈ ప్రాంతం అంటే పాలకులకు ఎందుకు నిర్లక్ష్యమని ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో పాలకులు మాత్రమే అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు. సిపిఎం పోరాటానికి తమ మద్దతు ఉంటుందన్నారు. సాగునీటి పోరాట నాయకులు ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ... సరైన సమయంలో పాదయాత్ర నిర్వహించడం మంచి పరిణామమని తెలిపారు. సురక్ష కార్యక్రమాలతో ఒరిగేదేమీ లేదని, కావలసింది సాగునీటి ప్రాజెక్టులని తెలిపారు. జెండాలు పక్కనపెట్టి ఒకే అజెండాతో పని చేయాలని, తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఇది ఆరంభం మాత్రమేనని అన్నారు.

ఆకట్టుకున్న నృత్యాలు..

ఎర్రజెండా చేతబూని దండుగా కదులుతున్న పాదయాత్ర బృందానికి ముందు ప్రజానాట్యమండలి సభ్యులు డప్పు వాయిస్తూ కేరింతలు వేస్తూ ముందుకు సాగారు. ఈ నేపథ్యంలోనే మహిళ కళాకారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

నేటి పాదయాత్ర ఇలా..

మహా పాదయాత్ర రెండో రోజు గురువారం బనవాసి ఫారం నుంచి హనుమాపురం, ఎమ్మిగనూరు మీదుగా గోనేగండ్ల వరకు పాదయాత్ర సాగనుంది.



పాదయాత్రను ప్రారంభిస్తున్న గఫూర్



సభలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్

సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె

- విద్యుత్ ఉద్యోగుల స్ట్రగుల్ కమిటీ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె చేస్తామని విద్యుత్ ఉద్యోగుల స్ట్రగుల్ కమిటీ హెచ్చరించింది. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర సమితి పిలుపుమేరకు కర్నూలు నగరంలోని కార్మిక, కర్షక భవన్ నుంచి విద్యుత్ భవనం వరకు ప్రదర్శన చేపట్టి, ధర్నా నిర్వహించారు. స్ట్రగుల్ కమిటీ జిల్లా నాయకులు నవీన్ కుమార్, శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. డిస్కం రాష్ట్ర అధ్యక్షులు సురేష్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.గోపాల్ హాజరై మాట్లాడారు. విద్యుత్ రంగంలో గత 20 ఏళ్లుగా పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయకుండా వారి శ్రమను దోచుకుంటున్నారని విమర్శించారు. కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేస్తానని, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో హామీఇచ్చారని, నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గోపాల్ మాట్లాడుతూ... చనిపోయిన జెఎల్ఎంఎస్ కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టకపోవడంతో వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయని తెలిపారు. తక్షణమే చనిపోయిన జెఎల్ఎంఎస్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిస్కం రాష్ట్ర అధ్యక్షులు సురేష్ మాట్లాడుతూ.... విద్యుత్ ఉద్యోగులకు 45 శాతం ఫిట్‌మెంట్‌తో పిఆర్‌సిని అమలు చేయాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులకు ఈపీఎఫ్ నుంచి జిపిఎఫ్ ఖాతాలు తెరవాలని డిమాండ్ చేశారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ... విద్యుత్ ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. నగదు రహిత అపరిమిత ఆరోగ్య పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ న్యాయమైన సమస్యలు పరిష్కరించకపోతే స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో సమ్మెకు సిద్ధం కావాలని తెలిపారు. అలాగే 7న తిరుపతి విద్యుత్ సౌధం దగ్గర జరిగే మహాధర్నాలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎఐటియుసి నగర అధ్యక్ష, కార్యదర్శులు జి.చంద్రశేఖర్, బి.వెంకటేష్, టి.రామాంజనేయులు, స్ట్రగుల్ కమిటీ నాయకులు రామకృష్ణ, భాస్కర్, హుస్సేన్, ప్రవీణ్ కుమార్, శ్రీనివాసులు, రాఘవేంద్ర, సునీత, సుదానా గౌడ్, రహిమాన్, మల్లన్న, ఆర్.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న జెసి మౌర్య

- జెసి నారపురెడ్డి మౌర్య

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఓటర్ల జాబితా సవరణపై ప్రజలకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిఆర్‌ఒను జెసి నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో స్పెషల్ సమ్మరీ రివిజన్-2024పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో జెసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లాలో స్పెషల్ సమ్మరీ రివిజన్-2024పై ఇంటింటి ఓటర్ల పరిశీలన పకడ్బందీగా జరుగుతోందని తెలిపారు. ఓటర్ల జాబితాలో ఉన్న జంక్ క్యారెక్టర్స్, ఒకే ఇంట్లో పదిమంది కంటే ఎక్కువ ఉన్న ఓటర్లు పరిశీలించాలని చెప్పారు. ఇల్లు లేని వారు, ట్రాన్స్‌జెండర్స్‌ను గుర్తించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాస్థాయిలో రాజకీయ పార్టీ ప్రతినిధులకు సమస్యల పరిష్కారం నిమిత్తం టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని డిఆర్ఒ, ఎన్నికల సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. డిఆర్ఒ నాగేశ్వరరావు, వైసిపి నాయకులు పుల్లారెడ్డి, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ గుప్తా, బీఎస్పీ ప్రతినిధి వి.రాజేష్, టిడిపి లీగల్ సెల్ జనరల్ సెక్రటరీ ఎల్‌వి.ప్రసాద్, ఎన్నికల సూపరింటెండెంట్ మురళీ పాల్గొన్నారు.

బేరియాట్రిక్ సర్జరీ సక్సెస్

బాధితునికి ఆరోగ్యాన్ని ప్రసాధించిన జెమ్ కేర్ కామినేని వైద్యులు

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్



సర్జరీ అయిన వ్యక్తితో జెమ్‌కేర్ కామినేని వైద్యులు

రాయలసీమలోనే తొలిసార కర్నూలులో అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్న జెమ్ కేర్ కామినేని ఆసుపత్రి మరోమారు వార్తల్లోకి ఎక్కింది. పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బాలాజీ (45)కి వైద్యులు డాక్టర్ ఎం బాలమురళి కృష్ణ(లాప్రో స్కోపిక్ సర్జన్), డాక్టర్ వి.సురేష్ కుమార్ రెడ్డి (సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్), డాక్టర్ ఆదిత్య (అనస్థీషియా) విజయవంతంగా బేరియాట్రిక్ సర్జరీచేసి బాధితునికి ఆరోగ్యాన్ని ప్రసాదించారు. బాలాజీ ఆసుపత్రిలో చేరే నాటికే మధుమేహం, అధిక రక్తపోటు స్థూలకాయం, స్ట్రోక్ వంటి సమస్యలతో బాధపడుతున్నారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ బాలమురళి కృష్ణ, డాక్టర్ సురేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నంద్యాల జిల్లాకు చెందిన బాలాజీ(వ్యకిగత గోప్యత కారణంగా పేరు మార్చడం జరిగింది) అనే వ్యక్తి 107 కేజీల బరువు ఉన్నారు. ఈ అధిక బరువు వలన నియంత్రణలో లేని మధుమేహం, అధిక రక్తపోటు వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. రక్తపోటు నియంత్రణకు యాంటీ ప్లేట్ లెట్ టాబ్లెట్స్‌ను కూడా వాడుతున్నారు. సర్జరీ అనంతరం అతని బరువు 90 కేజీలు అయ్యింది. ఈ సర్జరీతో అతనిలో గ్రెలిన్, లెప్రిన్ హార్మోన్ ల నియంత్రణ జరిగి కొద్ది రోజులకు 75 కేజీల బరువును కలిగి ఉంటారు. ఈ సర్జరీ రాయల సీమలో తొలిసారి జరిగిందన్నారు. బాలాజీ కేసు విషయంలో చాలా కాంప్లికేషన్స్ ఉన్నాయని, దీంతో బేరియాట్రిక్ సర్జరీ చేయాల్సి వచ్చింది. జీర్ణవ్యవస్థలో మార్పు తీసుకు రావడంతోపాటు పొట్ట పరిమాణాన్ని తగ్గించాం. బరువును కూడా అదుపు చేయగలిగామని అన్నారు. బేరియాట్రిక్ సర్జరీలపై ప్రజలల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం చాలా ఉంది. డాక్టర్ చంద్ర శేఖర్ మాట్లాడుతూ బేరియాట్రిక్ సర్జరీ చాలా కీలకమైనదని అన్నారు. తక్కువ మొత్తంలో సామాన్యులకు కూడా బేరియాట్రిక్ సర్జరీ సౌకర్యాన్ని అందించేందుకు మేము కషి చేస్తున్నట్టు చెప్పారు. బాలాజీ కేసు విషయంలో డాక్టర్ బాలమురళి కష్ణ, డాక్టర్ ఆదిత్య, డాక్టర్ సురేష్ కుమార్ రెడ్డి చేసిన కృషి అద్భుతమైన ఫలితాన్ని ఇచ్చిందన్నారు. సర్జరీ విజయవంతం కావడంలో వారి కృషి అభినందనీయమని ప్రశంసించారు. హాస్పిటల్ జనరల్ మేనేజర్ నదీమ్ మాట్లాడుతూ ఇటువంటి క్లిష్టమైన సర్జరీలు విజయవంతంగా చేయడానికి జెమ్ కేర్ కామినేని హాస్పిటల్ వైద్యులు ఎల్లవేళల అందుబాటులో ఉంటారన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేయండి : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి -సి బెళగల్

సీజనల్ వ్యాధులు ప్రభలిన సందర్భంగా గ్రామాల్లో అప్రమత్తం చేయాలని డిఎంహెచ్‌ఒ రామగిడ్డయ్య సంబంధించిన అధికారులకు ఆదేశించారు. మంగళవారం సి.బెళగల్ లోని 24 గంటల ఆసుపత్రిని సందర్శించి సిబ్బంది హాజరు, సేవలను గూర్చి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం వర్షాకాలంతో భూమిలో కొత్త నీరు చేరిందని, ఆ నీరు తాగుట వలన ప్రజలకు అనారోగ్యం తప్పదని అన్నారు. అందుకే కాచి వడపోసిన నీటిని తాగాలని ప్రధానంగా కండ్ల కలక వ్యాధి నివారణకు తగు సూచనలు ఇవ్వాల్సిందిగా కోరారు.

మోడీ పాలనలో మైనార్టీలకు రక్షణ కరువు

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టరేట్



మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షడు సుధాకర్‌బాబు

దేశంలో నరేంద్ర మోడీ పాలనలో ముస్లిం మైనార్టీలకు రక్షణ లేదని డిసిసి అధ్యక్షుడు ఎం సుధాకర్ బాబు విమర్శించారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ ముస్లిం మైనార్టీ సెల్ చైర్మన్ మహమ్మద్ నూర్ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సుధాకర్ బాబు మాట్లాడుతూ బిజెపి పాలిత రాష్ట్రం మణిపూర్‌లో జరిగిన హింసకాండకు బాధ్యవహించి మోడీ అమిత్ షాలు వెంటనే రాజీనామా చేయాలన్నారు. బిజెపి అంటే బాబు జగన్ పవన్ అని మోడీని ఎదిరించే దమ్ము ఈ ముగ్గురికి లేదన్నారు. మణిపూర్ హింసకాండను ప్రపంచ దేశాలు ప్రశ్నిస్తుంటే మన రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష నాయకులు నోరు మెదపడం లేదన్నారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షులు మహమ్మద్ నూర్ మాట్లాదారు. నగర కాంగ్రెస్ అధ్యక్షులు జాన్ విల్సన్ డిసిసి ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ గుప్త ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి.బతుకన్న ,కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి దామోదరం రాధాకృష్ణ, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు ఎస్‌సి బజారన్న పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

జగనన్న సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పౌష్టికాహారం తోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కర్నూలు ఎమ్మెల్యే ఎంఏ.హఫీజ్‌ఖాన్ అన్నారు. బుధవారం కర్నూలు నగరం లోని బుధవారపేట చెట్టు కింద బడి అంగన్వాడి కేంద్రం లోని "మహిళాభివృద్ధి , శిశు సంక్షేమ శాఖ" వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన "వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ" టేక్ హో రేషన్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హఫీజ్‌ఖాన్, కో ఆప్షన్ మెంబెర్ వైసిపి ముఖ్య నాయకులు కార్పొరేటర్లు పంపిణీ చేశారు. హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కార్యక్రమం ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. పుట్టబోయే బిడ్డ నుండి అవ్వ తాతల వరకు ప్రతి ఒక్కరి గురించి సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆలోచిస్తున్నారని అన్నారు. మహిళలకు ముఖ్య ప్రాధాన్యత ఇస్తూ గర్భిణిలకు పౌష్టికాహారం, తల్లికి అమ్మ ఒడి, మహిళా పేరుపై ఇంటి పట్టా,45 ఏళ్ళు ఉన్న మహిళకి జగనన్న చేయూత, ఇలాంటి ఎన్నో పథకాలను ప్రారంభించారని తెలిపారు. గర్భిణీ స్త్రీలు బాలింతలకు మంచి పౌష్టికాహారం అందించాలని ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన పౌష్టిక ఆహార కిట్లను,రేషన్‌ను పంపిణీ చేశారు. వైసిపి నాయకులు, కో ఆప్షన్ మెంబెర్ శ్రీరాములు, సేవాదళ్ ప్రెసిడెంట్ కేదార్ నాథ్, రెడ్డి మంజులత, క్రాంతి కుమార్, పవన్, స్థానిక కార్పొరేటర్, వసంత్, గోపి, కసీమ్, రాముడు, మాల్యాద్రి పాల్గొన్నారు.



పోషకాహార కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

చేనేతను ఆదుకునేదెవరు?

సాగునీటి సౌకర్యం అరకొరే-పట్టణం లో మౌలిక వసతులు కరువు- నేడు ఎమ్మిగనూరుకు రానున్న సిపిఎం మహాపాదయాత్ర

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ /ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు కేంద్రంచేనేత వస్త్రాల తయారీకి కేంద్ర బిందువుగా ఉన్నప్పటికీ అక్కడ ఉన్న కార్మికులను ఆదుకునే వారు లేరు. మండలంలోని అనేక గ్రామంలో రైతుల పంటల పొలాలకు పూర్తిస్థాయి సాగునీటి సౌకర్యం కూడా అరకొరగానే ఉంది. పట్టణ ప్రాంతం విస్తరించి నప్పటికీ అందుకు తగ్గట్టు మౌలిక వసతులు లేని పరిస్థితి ఉంది. కర్నూలు జిల్లా సమగ్ర అభివృద్ధిలో భాగంగా సిపిఎం చేపట్టిన మహాపాదయాత్ర గురువారం ఎమ్మిగనూరులోకి ప్రవేశిస్తుంది. ఇందులో భాగంగా ఇప్పటికే సిపిఎం ప్రతినిధి బృందం ఎమ్మిగనూరులో పర్య టించి అనేక సమస్యలను గుర్తించింది. ఈ సమస్యల పరిష్కా రానికి పాలకుల దృష్టి సారించాలని డిమాండ్ చేస్తుంది.

టెక్స్‌టైల్ పార్కు కు భూకేటాయింపుకే పరిమితం


ఎమ్మిగనూరు తాలూకా పరధిలో ఆరువేలకు పై కుటుంబాలకు చేనేత వత్తిపై ఆధారపడి జీవనం కొన సాగిస్తున్నాయి. అలాంటి వారిని ఆదుకోవాల్సిన పాలక ప్రభుత్వాలు కంటి తుడుపు చర్యగా వారికి ఆర్థిక సాయం పేరుతో మంజూరు చేస్తున్నాయి. పూర్తిస్థాయి సమస్యల పరిష్కా రానికి దృష్టి సారించడం లేదు. గత ప్రభుత్వ హ యాంలో బనవాసి కేంద్రంలో 96.5 ఎకరాలకు పైగా టెక్స్‌టైల్ పార్కులకు కేటాయించారు. ఇప్పటివరకు టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఈ ప్రాంతం చుట్టూ ఉన్న స్పిన్నింగ్ మిల్లులు మూత పడ్డాయి. చేనేత సహకార సొసైటీ కూడా ప్రభుత్వం నుండి ఎలాంటి తోడ్పాటు లేకపోవడంతో ఉత్సవ విగ్రహం లాగా తయారయింది. చేనేత కార్మికులు నేసిన వస్త్రాలకు పూర్తిస్థాయి మార్కెటింగ్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కార్మికులకు ముడి సరుకు కూడా సబ్సిడీ కింద ప్రభుత్వం ఇవ్వడం లేదు. ఓవైపు ప్రయివేటు యజమానులు తయారు చేయించుకున్న వస్త్రాలకు అమ్ముడుపోయిన తర్వాత నగదును చెల్లిస్తున్న పరిస్థితి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం కార్మికుల సంక్షేమానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

పట్టణం విస్తరించినా వసతులు కరువు

ఎమ్మిగనూరు పట్టణ ప్రాంతం విస్తరించి నప్పటికీ ఇప్పటివరకు పూర్తిస్థాయి వస్తువులు లేనటువంటి పరిస్థితి ఉంది. గతంలో 30 సంవత్సరాల క్రితం వేసిన రోడ్లు మినహాయించి ఇప్పటివరకు కొత్త రోడ్లు వేయలేదు. అనేక చోట్ల డ్రైనేజీ కాలువల సమస్య కూడా తీవ్రంగా ఉంది. పట్టణ ప్రాంతంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేసినా ఆచరణలోకి తీసుకురావడం లేదు. పట్టణ ప్రాంతంలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో గృహాలను పేదలకు పంపిణీ చేయలేదు.

గ్రామీణ ప్రాంతంలో కొరవడిన సాగునీటి సౌకర్యం

ఎమ్మిగనూరు గ్రామీణ ప్రాంతంలోని అనేక గ్రామాలకు సాగునీటి సౌకర్యం లేకపోవడంతో రైతుల పంట పొలాలకు సాగునీటి సౌకర్యం లేదు. గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మించి మండలంలోని అనేక గ్రామాలకు సాగు తాగునీటి సౌకర్యాన్ని కల్పించవచ్చు. ఏనుగుబాల చెరువు, గురు రాఘవేంద్ర ప్రాజెక్టు ద్వారా పైప్‌లైన్ పూర్తి చేసి దాదాపుగా 1000 ఎకరాలకు రెండు పంటల సాగు నీరు కల్పించేందుకు అవకాశం ఉన్నా పాలకులు అలాంటి చర్యలు తీసుకోవడం లేదు. వీటిపై దృష్టి సాటించడం లో ప్రస్తుత,గత పాలకులుకూడా చిత్తశుద్ధితో వ్యవహరించలేదు.



ఎమ్మిగనూరు సమస్యలను పట్టని పాలకులు

గోవిందు సిపిఎం మండల నాయకులు




ఎమ్మిగనూరు ప్రాంత సమస్యలను పాలకులు విస్మరించుకుంటూ వస్తున్నారు. ఇక్కడున్న స్పిన్నింగ్ మిల్లులు తెరిపించి చేనేత కార్మికులను ఆదుకోవడంలో విఫలమయ్యారు. టెక్స్‌టైల్ పార్కును కేవలం భూ కేటాయింపులు చేసి అభివృద్ధి చేయడంలో విస్మరించారు. ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకలతో అభివద్ధి చేయాలి. ఎమ్మిగనూరు ప్రాంత అభివద్ధిని బడ్జెట్‌లో ప్రత్యేక విధులను కేటాయించాలి.



చేనేత కార్మికులను ఆదుకోవాలి

-కష్ణ, చేనేత సంఘం నాయకులు

చేనేత కార్మికులను ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలి. ఇక్కడున్న స్పిన్నింగ్ మిల్లులను తెరిపించాలి. ముడి సరుకులను సబ్సిడీ కింద అందజేయాలి. చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలకు నేరుగా మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పించాలి. కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి. చితికి పోయిన చేనేత కార్మికులకు యుద్ధప్రాతిపదికన ఉపాధి సౌకర్యాలను మెరుగు పరచాలి.



లబ్ధిపత్రాలను అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు

ముఖ్యమంత్రి జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్

ప్రజాశక్తి - హొళగుంద

ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యమని, ముఖ్యమంత్రి సూచనలతో తనకు ప్రజాసేవ చేసుకునే అవకాశం దక్కిందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ తెలిపారు. బుధవారం మండలంలోని నేరనికి గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన విధంగా ప్రతి సంక్షేమ పథకాన్ని అందించినట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి పథకాల కింద నెరనికి, నెరనికి తండా, కొత్తపేట గ్రామాలకు రూ.15,70,27,218లు అందించినట్లు తెలిపారు. వివిధ పనులు, తాగునీటి కోసం రూ.20 లక్షలతో ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి చేయడంతో తాము ప్రజల ముందు తలెత్తుకుని తిరుగుతున్నామని తెలిపారు. రోడ్ల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వైసిపి ఆలూరు నియోజకవర్గ తాలూకా బాధ్యులు నారాయణ స్వామి, ఎంపిపి తనయుడు ఈషా, నాయకులు తోక వెంకటేష్, మండల కన్వీనర్ షఫీవుల్లా, తహశీల్దార్ హుస్సేన్ సాబ్, దినోజు కుమార్, హౌసింగ్ అధికారి బి.ఆదినారాయణ, పిఆర్ ఎఇ సోమప్ప, ఎఒ ఆనంద్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

మెరుగైన విద్యనందించండి

- ఎస్ఎస్ఎ ఎపిసి వేణుగోపాల్



పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న వేణు గోపాల్

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రభుత్వం విద్యార్థు లకు అన్ని వసతులూ సమకూర్చుతోందని, మంచి ఫలితాలు రాబట్టేందుకు మెరుగైన విద్య నందించాలని ఎస్ఎస్ఎ ఎపిసి, మండల ప్రత్యేకాధికారి డాక్టర్ కె.వేణుగోపాల్ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండలంలోని నేమకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, పాఠశాల పనితీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అటెండెన్స్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందించాలనే ఆకాంక్షతో మెరుగైన వసతులతో పాటు విద్యనందించాలని ఉపాధ్యాయులను కోరారు. నాడు-నేడు రెండో విడత కింద మండలంలోని 13 పాఠశాలలకు 903 ఫర్నీచర్స్ అందిస్తున్నామని తెలిపారు. అలాగే ఉపాధ్యాయ సిబ్బందికి కూడా 293 ఫర్నీచర్స్ ఇస్తున్నామన్నారు. ప్రయివేట్ పాఠశాలలకు ఏమాత్రం తగ్గకుండా ప్రభుత్వ పాఠశాలలో వందశాతం ఫలితాలు వచ్చేలా కృషి చేయాలన్నారు. ఎంఇఒలు సావిత్రమ్మ, బాల నాయుడు, ప్రధానోపాధ్యాయులు నాగయ్య, ఎంఆర్‌సి అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రతి పంచాయతీలోనూ మొక్కలు నాటాలి

- ఎంపిడిఒ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పెద్దకడబూరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీనివాసరావు

మండల పరిధిలోని ప్రతి పంచాయతీలో ఉన్న ప్రభుత్వ భవనాల్లో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ శ్రీనివాసరావు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం పెద్దకడబూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'నా భూమి - నా దేశం' కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భవనాల్లో 75 మొక్కలు నాటాలన్నారు. మొక్కలను ఉపాధి హామీ చట్టం కింద పంపిణీ చేస్తామని తెలిపారు. టెక్నికల్ అసిస్టెంట్లు ఎర్రన్న, రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

'ఆర్‌సి' కోసం రెండేళ్లుగా ఎదురుచూపులు..!

- వాహనదారుల కష్టాలు తీరేదెప్పుడు..?

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

కొత్త వాహనం కొనుగోలు చేసినా, డ్రైవింగ్ లైసెన్స్ పరీక్ష గట్టెక్కిన వెంటనే కార్డు వస్తే ఆ ఆనందమే వేరు. అందుకు భిన్నంగా గత రెండేళ్లుగా ఆర్‌సి కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ కార్డులు అందకపోవడంతో వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. పైగా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. రవాణా శాఖ జారీ చేసే కార్డులకు సంబంధించి సామగ్రి రాష్ట్ర కార్యాలయం నుంచి సరఫరా లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఆర్‌సిలు, డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనాల బదిలీలు, చిరునామాల మార్పు, రెన్యువల్ తదితర అంశాలకు సంబంధించి జిల్లాలో లక్షల సంఖ్యలో కార్డులు ముద్రించి సరఫరా చేయాల్సి ఉంది. రవాణా శాఖకు సంబంధించి వస్తున్న గ్రీవెన్స్‌ల్లో ఎక్కువగా కార్డులకు సంబంధించినవే ఉండడం గమనార్హం.

జిల్లాలో రోజుకు వెయ్యికిపైగా వాహనాలు రిజిస్ట్రేషన్ అవుతున్నాయి. డ్రైవింగ్ లైసెన్స్‌లు, చిరునామాల మార్పులు, రెన్యువల్ తదితర కార్డులు కూడా రోజూ వందల సంఖ్యలో ఉంటాయి. నూతన వాహనాలు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న వారు ఆర్‌సి ఎప్పుడు వస్తుందోనని ఎదురుచూస్తున్నారు. నెలల తరబడి రాకపోవడంతో రవాణా శాఖ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. జిల్లాలో పరిస్థితిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా వాయిదా వేయడం మినహా సామగ్రి సరఫరా చేయడం లేదని రవాణా శాఖ వర్గాలు చెబుతున్నాయి. సామగ్రి వచ్చినా లక్షల సంఖ్యలో కార్డులు ముద్రించి ఇవ్వడానికి సమయం పడుతుందని వివరిస్తున్నారు. పాత వాటితోపాటు కొత్తగా ఇవ్వాల్సిన కార్డులు కలిపితే మరింత జాప్యం జరిగే అవకాశం ఉంది.

ఎప్పుడిస్తారో చెప్పేది ఎవరు..?

కార్డుల ముద్రణ, పంపిణీకి సంబంధించి రూ.235 చొప్పున వాహనదారుల నుంచి రవాణా శాఖ వసూలు చేస్తోంది. స్టేషనరీ కొరత వల్ల కార్డులు వెంటనే ముద్రించి ఇవ్వలేకపోతున్నారు. ఎప్పటికి ఇస్తారో కూడా సంబంధిత అధికారులు చెప్పలేకపోతున్నారు. వాహనాలకు ఫ్యాన్సీ నెంబర్లు తీసుకున్న వారు, కొత్తగా డ్రైవింగ్ లైసెన్స్ పొందినవారు కార్డుల కోసం రవాణా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. జిల్లాలో లక్షల సంఖ్యలో కార్డులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వస్థాయిలో నిర్ణయం తీసుకొని జిల్లా కార్యాలయాలకు సామగ్రి సరఫరా చేయాల్సి ఉండడంతో జిల్లాస్థాయిలో కార్డులు ఎప్పటి నుంచి ఇస్తామన్న సమాచారం సైతం వాహనదారులకు ఇవ్వలేకపోతున్నారు.



ప్రాంతీయ రవాణా శాఖాధికారి కార్యాలయం

రెండేళ్లుగా ఇదే పరిస్థితి

దాదాపు రెండేళ్ల నుంచి వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సి కార్డులు అందడం లేదు. డ్రైవింగ్ పరీక్షలకు వెళ్లి ఉత్తీర్ణులైనా కార్డులు ఇవ్వడకుండా, కంప్యూటర్ ప్రింటెడ్ కాగితం ఇచ్చి సరిపెట్టుకోమంటూ అధికారులు చెబుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే డ్రైవింగ్ లైసెన్స్ కీలకం. కొన్ని కేసులకు సంబంధించి కోర్టు వారు వీటిని అడుగుతున్నారు.

పోలీసులతో తిప్పలు తప్పడం లేదు

- రంగస్వామి, వాహనదారుడు

ఇటీవల కాలంలో డ్రైవింగ్ లైసెన్స్‌లో ఉత్తీర్ణత పొంది, కొత్త బండి కొన్నాను. పోలీసులు పట్టుకున్నప్పుడల్లా ఆర్‌సి, డ్రైవింగ్ లైసెన్స్ అడుగుతున్నారు. కార్యాలయంలో పేపర్ ఇచ్చినా అవి వర్షాకాలం కావడంతో వర్షంలో తడవడంతో రూ.300 చలానా కట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి సకాలంలో ఆర్‌సి, డ్రైవింగ్ లైసెన్స్ ఇవ్వాలి.

ఆంధ్ర సరిహద్దుకు తుంగభద్ర జలాలు

ప్రజాశక్తి - కౌతాళం

తుంగభద్ర డ్యాం నుంచి నీరు ఆంధ్ర సరిహద్దుకు బుధవారం చేరుకున్నాయి. తుంగభద్ర దిగువ కాలువ ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన హనవాళ్‌కు జలాలు చేరుకోవడంతో అధికారులు జలహారతి ఇచ్చి పూజలు చేశారు. తుంగభద్ర దిగువ కాలువ ఈఈ శైలేశ్వర్ రెడ్డి, ఏఈ రంగస్వామి మాట్లాడుతూ... తుంగభద్ర నీరు ఆంధ్రాలోకి ప్రవేశించడంతో దిగువ పరిధిలోని గ్రామాలకు తాగు, సాగునీరు అందించవచ్చని తెలిపారు. ఈ నీరు కర్నూలుకు చేరుకున్న అనంతరం ముందుగా తాగునీటి కోసం రిజర్వాయర్లకు సరఫరా అవుతాయన్నారు. జలమండలి సమావేశం తర్వాత ఆయకట్టుకు సాగునీరందించే అవకాశం ఉందన్నారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో అనేక సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లో నీరు లేకపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడిందని తెలిపారు. దిగువ కాలువకు నీరు రావడంతో ఈ సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందన్నారు. ఎల్ఎల్‌సి సిబ్బంది పీర్ సాబ్ పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న నాయకులు

బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తించండి : పీఠాధిపతులు

ప్రజాశక్తి - మంత్రాలయం

మేనేజర్లుగా అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు ఆదేశించారు. బుధవారం స్థానిక శ్రీరాఘవేంద్రస్వామి మఠం ఆధీనంలో ఉన్న వివిధ రాష్ట్రాల్లో ఉన్న బ్రాంచి మేనేజర్లతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ ఏడాది ఈనెల 29 నుంచి సెప్టెంబర్ 4 వరకు శ్రీగురు రాఘవేంద్రస్వామి వైభవోత్సవాల నిర్వహణకు తీసుకోవాల్సి ముందు జాగ్రత్త చర్యల గురించి తెలిపారు. బ్రాంచీలకు వచ్చే విరాళాలు, ఖర్చులకు సంబంధించిన లెక్కలు నిర్దిష్టంగా ఉండాలని సూచించారు. లక్ష్యాలను సాధించే ఉద్దేశంతో ఒక స్పష్టమైన విజన్ వ్యూహాత్మకంగా ఉండాలని చెప్పారు. ఎఎఒ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కె.శ్రీనివాస రావు, వెంకటేష జోషి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు

ఉపాధ్యాయుల అలవెన్స్ సమస్యను తీర్చాలి

- యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు జీవిత



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

వర్క్ అడ్జస్ట్‌మెంట్‌పై పని చేసిన ఉపాధ్యాయుల అలవెన్స్ (జీతాల) సమస్యను తీర్చాలని యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు బి.జీవిత, జిల్లా కార్యదర్శి టి.గాది లింగప్ప కోరారు. బుధవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో అదనపు ఖజానా అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగావారు మాట్లాడారు. కేడర్ స్ట్రెంత్ అప్‌డేషన్, డిడిఒ కోడ్ మ్యాపింగ్, పాత డిడిఒ కోడ్‌ల పునరుద్ధరణపై చర్చించామని తెలిపారు. జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, మల్లికార్జున, రూరల్ అధ్యక్షులు రామాంజనేయులు, ఎల్‌కె.బసప్ప, నరసయ్య గౌడ్, కృష్ణమూర్తి, నారాయణ, ఉరుకుందయ్య, రంగన్న, భాస్కర్, రంగారెడ్డి, సుధాకర్ నాయక్, రాము, రమేష్, విష్ణువర్ధన్ రెడ్డి, జగన్ పాల్గొన్నారు.

'కళ్లకలక' పట్ల అప్రమత్తత అవసరం

- వైద్యాధికారి డాక్టర్ శాంతిజ్యోతి

ప్రజాశక్తి - పెద్దకడబూరు

కళ్లకలక వ్యాధి పట్ల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిణి శాంతిజ్యోతి తెలిపారు. బుధవారం పెద్దకడబూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న గ్రామాల్లో వైద్యాధికారి శాంతిజ్యోతి కళ్లకలక వ్యాధిపై అవగాహన సదస్సులు నిర్వహించి రోగులకు వైద్య పరీక్షలు చేసి, వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈనెల 1 నుంచి 7 వరకు అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు జరుగుతాయని, గర్భిణులు, బాలింతలు పాల్గొనాలని సూచించారు. ఈనెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో పిల్లలకు నులి పురుగుల నివారణ గుళికలు పంపిణీ చేస్తారని తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న డాక్టర్ శాంతి జ్యోతి

ఫ్యాన్ కింద కూర్చోవడమే డ్యూటీనా..?

- సచివాలయ సిబ్బందిపై ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆగ్రహం

ప్రజాశక్తి - ఆదోని

ఫ్యాన్ కింద కూర్చోవడమే డ్యూటీనా అని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించాలని ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారని తెలిపారు. అలాంటి వ్యవస్థ వల్ల ప్రజలకు మేలు జరిగేలా ఉద్యోగులు విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. బుధవారం పట్టణంలోని అమరావతి నగర్‌లో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. అంతకుముందు ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డికి నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా సైరా బాను అనే మహిళ మాట్లాడుతూ... నాలుగేళ్ల నుంచి వితంతు పింఛను రావడం లేదని తెలిపారు. మరో మహిళ తన కుమారుడికి అమ్మ ఒడి రాలేదని, ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యేకు వివరించారు. సచివాలయ ఉద్యోగులు హరిప్రసాద్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు పింఛన్లు, అమ్మఒడి ఇవ్వకపోతే సచివాలయం ఎందుకు, సిబ్బంది ఎందుకని ప్రశ్నించారు. అసలు మీరేం చేస్తున్నారని సిబ్బందిని మందలించారు. పని చేయని వారిని సస్పెన్షన్ చేస్తే జీతం అందక పడే బాధలు అర్థమవుతాయని తెలిపారు. పనులు చేయకుండా తమాషా చూస్తున్నారా అని ప్రశ్నించారు. పనిచేయని వారిపై తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డిని ఆదేశించారు. మరోమారు ఎమ్మెల్యే సచివాలయ ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. గురువారం జరిగే 'గడపగడపకు'లో వార్డులోని పూర్తి వివరాలు తీసురావాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎమ్మెల్సీ మధుసూదన్, కాంట్రాక్టర్ ఎర్రి స్వామి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ అబ్దుల్ ఖాదర్, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ కామాక్షి తిమ్మప్ప, వైసిపి పట్టణ అధ్యక్షులు దేవా, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీరు రాజశేఖర్ రెడ్డి, మెప్మా అధికారి వీరారెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

మహా పాదయాత్రకు సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - కోసిగి

సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహా పాదయాత్రకు బుధవారం సిపిఎం కోసిగి మండల కన్వీనింగ్ కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున బయల్దేరి వెళ్లారు. సిపిఎం మండల కన్వీనర్ రాముడు మాట్లాడుతూ... పులికనుమ ప్రాజెక్టు నుంచి కోసిగి, చుట్టుపక్కల గ్రామాలకు సాగు, తాగునీరు అందించాలని కోరారు. ఆర్‌డిఎస్ కుడికాలువ నిర్మాణం పూర్తి చేస్తే మండలంలోని అన్ని గ్రామాలకు తాగునీరు అందించవచ్చని తెలిపారు. మండలంలో వలసలు నివారించి, కూలీలకు స్థానికంగా పనులు కల్పించాలని కోరారు. మండలంలో అన్ని గ్రామాలకు రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించాలని, మండలంలో నెలకొన్న అనేక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల నాయకులు వీరేష్, రామకోటి హనుమంతు, కడదొడ్డి నాగేంద్ర, హనుమంతు, సాతనూరు నజీర్ పాల్గొన్నారు. **దేవనకొండ** మండలం నుంచి మహా పాదయాత్రలో సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, మండల నాయకులు అశోక్, సూరి, మహబూబ్ బాషా, శ్రీనివాసులు, ఓంకార్, రాఘవరెడ్డి, బజారి, శ్రీరాములు, నాగరాజు, బలరాముడు, రాముడు, తిక్కయ్య, మహేష్, సుధాకర్ పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో 'రీ సర్వే' వేగవంతం

- తహశీల్దార్ చంద్రశేఖర్

ప్రజాశక్తి - మంత్రాలయం


మండలంలోని మూడు గ్రామాల్లో భూములకు సంబంధించి రీ సర్వే పనులు వేగవంతంగా పూర్తి చేయాలని తహశీల్దార్ చంద్రశేఖర్ ఆదేశించారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఒలు, గ్రామ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని 52 బసాపురం, మంచాల, రచ్చుమర్రి గ్రామాల్లో రీసర్వే జరుగుతోందని తెలిపారు. అందులో భాగంగానే అడంగల్‌లో మార్పులు, చేర్పులపై రైతులకు సమాచారం అందించి అభ్యంతరాలు లేకుండా పనులు పూర్తి చేయాలని కోరారు. రీసర్వే వల్ల రైతుల భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందని, గ్రామాల్లోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల సర్వేయర్ వాహిద్, విఆర్‌ఒలు భీమనగౌడు, ఆనంద్, నరసప్ప, ప్రభాకర్, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

రాయలసీమ ద్రోహి జగన్మోహన్ రెడ్డి

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాయలసీమ ద్రోహి జగన్మోహన్ రెడ్డి కాదా అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వరరెడ్డి మండిపడ్డారు. బుధవారం ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి సున్నా అని, అరాచకాలు మాత్రం తారాస్థాయికి చేరాయని విమర్శించారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి పట్టణంలో అండర్ గ్రౌండ్ పనులను కేవలం 6 నెలల్లో పూర్తి చేస్తామని కౌన్సిల్ హాలులో విలేకరుల సాక్షిగా హామీఇచ్చారని తెలిపారు. నాలుగున్నరేళ్లయినా ఇచ్చిన మాట విస్మరించారని విమర్శించారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో రోడ్ల కోసం టిడిపి హయాంలో 14వ ఆర్థిక సంఘంలో జిఒ 229 ద్వారా మంజూరు చేసిన సుమారు రూ.27 కోట్ల నిధులు ఎక్కడ అని ప్రశ్నించారు. సుమారు రూ.1980 కోట్లతో మంజూరు చేసిన ఆర్‌డిఎస్ ప్రాజెక్టు పనులు ఎక్కడ అని నిలదీశారు. ఎమ్మిగనూరులో దాదాపు 6 వేల మంది చేనేతలు ఉంటే 1వ విడత 1900 మందికి, 2వ విడత 1580 మందికి, 3వ విడత 1380 మందికి మాత్రమే వర్తింపజేయడం ఏమిటని ప్రశ్నించారు. పట్టణంలోని ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు వాడుకుంటున్నారని మండిపడ్డారు. పట్టణంలో వైసిపి నాయకులు వ్యాపారం చేసుకోవచ్చు, వేరే వారు హోటళ్లు, తదితర వ్యాపారం చేసుకోవాలంటే ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నాకేశవ రెడ్డికి కప్పం కట్టాలా అని ప్రశ్నించారు. టిడిపి హయాంలో ఎమ్మిగనూరు ప్రాంత ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని టెక్స్‌టైల్స్ పార్కు కోసం 96 ఎకరాలు కేటాయిస్తే ఆ భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో ముస్లిం బాలిక, ఇటీవల కాలంలో బీసీ బాలికలపై అఘాయిత్యాలు జరిగినా ఇక్కడి ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, ఇదేనా మహిళలకు ఇచ్చే గౌరవమని ప్రశ్నించారు. దయాసాగర్, రాందాస్ గౌడ్, కొండయ్య చౌదరి, కలీముల్లా, రంగస్వామి గౌడ్, సుందర్‌రాజు, రామకృష్ణ, మైనార్టీ నాయకులు తురేగల్ నజీర్ అహ్మద్, సలాం, చేనేత నాయకులు మల్లికార్జున పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీవీ

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి

- జిల్లా ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త సుజాత

ప్రజాశక్తి-ఆలూరు

రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువులను ఉపయోగించాలని జిల్లా ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త సుజాత సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ పంటల సాగుపై మండల రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈఏడాది వర్షాలు ఆలస్యమయ్యాయని, రైతులు వ్యవసాయ అధికారుల సూచనల మేరకు మేలు రకమైన పంటలు వేయాలని సూచించారు. ఆలూరు ఎడిఎ సునీత, ఎఒ వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న సుజాత

రక్తహీనతను పారదోలుదాం

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

రక్తహీనత వల్ల కాన్పు సమయంలో అపస్మారక స్థితిలోకి వెళ్లి మహిళలు చనిపోరాదన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం పోషకాహారం అందిస్తోందని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డి సూచించారు. బుధవారం పట్టణంలోని 35వ వార్డు సచివాలయం వద్ద గర్భిణులు, బాలింతలకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం కింద పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు పోషకాహార లోపం వల్ల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వారందరూ ఆరోగ్యంగా ఉండాలని గుడ్లు, పాలు, గోధుమ పిండి, బెల్లం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఐసిడిఎస్ కార్యాలయ సూపరింటెండెంట్ శంకర్ మాట్లాడుతూ... 10 రకాల నిత్యావసర సరుకులు, ఇతర కిట్లు వారి ఇళ్ల వద్దకే నెలకోసారి ఉచితంగా అందిస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అంగన్వాడీలకు ఉచితంగా యూనిఫారం పంపిణీ చేశారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు రాగిణి వసంత, మహాదేవి, సావిత్రి, స్వయంప్రభ ఉన్నారు. **మంత్రాలయం** మండలం రాంపురం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కిటన్లు అందజేశారు. సిడిపిఒ నాగమణి, సూపర్‌వైజర్ నాగలక్ష్మి పాల్గొన్నారు. **కౌతాళం** సర్పంచి పాల్‌దినకర్ అధ్యక్షతన ఎంపిపి అమ్రేష్, వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, ఎంపిడిఒ సుబ్బరాజులు కిట్లను పంపిణీ చేశారు. వైస్ ఎంపిపి బుజ్జి స్వామి, కో ఆప్షన్ సభ్యులు మాబు సాబ్, వైసిపి నాయకులు రామన్న గౌడ్, చౌదరి బసవరాజ్, సుబ్బరాజు, సక్రి తిక్కయ్య, రాఘవేంద్ర రెడ్డి, తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డి, అంగన్వాడీ సూపర్‌వైజర్ పావని పాల్గొన్నారు. **ఆస్పరి**లోని 3, 5వ అంగన్వాడీ కేంద్రాల్లో ఐసిడిఎస్ సిడిపిఒ నిర్మలాదేవి ఆధ్వర్యంలో పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. జడ్‌పిటిసి దొరబాబు, వైసిపి మండల మాజీ కన్వీనర్ రామాంజనేయులు, వైసిపి మండల కన్వీనర్ పెద్దయ్య, నాయకులు రాజన్న గౌడ్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు సునీత, పద్మ, అంగన్వాడీ టీచర్లు రసూల బేగం, శ్రీలత, జయమ్మ, విశ్వకుమారి, రాధమ్మ పాల్గొన్నారు. **పెద్దకడబూరు** మండల పరిషత్ కార్యాలయంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు విజయకుమారి, వీరగోవిందమ్మ ఆధ్వర్యంలో కిట్లను పంపిణీ చేశారు. అలాగే అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలకు యూనిఫారం పంపిణీ చేశారు. ఎంపిపి శ్రీవిద్య, వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, సర్పంచి రామాంజనేయులు, ఎంపిడిఒ శ్రీనివాసరావు, పిఆర్ ఎఇ మల్లయ్య, ఎపిఒ రామన్న, పాల్గొన్నారు. **దేవనకొండ** అంగన్వాడీ కేంద్రం-లో పోషకాహార కిట్లను ఐసిడిఎస్ సూపర్‌వైజర్స్ శివలింగమ్మ, షాహినా బేగం ఆధ్వర్యంలో తహశీల్దార్ వెంకటేష్ నాయక్, జడ్‌పిటిసి కిట్టు పంపిణీ చేశారు. అలాగే తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఎంపిటిసి తపాల శ్రీనివాసులు, తెర్నేకల్ సర్పంచి అరుణ్ కుమార్, వైసిపి నాయకులు చాప వీరన్న, రాఘవేంద్ర, హెల్త్ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు జ్యోతి, సరస్వతి, ఎర్రమ్మ, హుస్సేనమ్మ, వెంకటేశ్వరమ్మ, వెంకటలక్ష్మి, మహిళా పోలీసు సుహాసిని పాల్గొన్నారు.



కౌతాళంలో కిట్లను పంపిణీ చేస్తున్న నాయకులు



ఆస్పరిలో కిట్లను పంపిణీ చేస్తున్న నాయకులు



ఆదోనిలో కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే



మంత్రాలయం : కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే



పెద్దకడబూరులో కిట్లను పంపిణీ చేస్తున్న నాయకులు



దేవనకొండలో కిట్లను పంపిణీ చేస్తున్న నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మైక్రో ఇరిగేషన్ ముఖ్య అధికారి సత్యనారాయణ

బిందు సేద్యంతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - ఆత్మకూరు

బిందు, తుంపర సేద్యంతో అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా మైక్రో ఇరిగేషన్ ముఖ్య అధికారి సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని కరివెన రైతుభరోసా కేంద్రంలో ఆత్మకూరు, పాములపాడు, కొత్తపల్లి, వెలుగోడు ఆర్‌బికె వ్యవసాయ సిబ్బందికి బిందు, తుంపర సేద్యం పథకంపై శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఉద్యానవన అధికారి చందన అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బోరు సదుపాయం ఉన్న రైతులందరూ మైక్రో ఇరిగేషన్ విధానం వైపు అడుగులు వేసేందుకు ప్రభుత్వం ఐదు ఎకరాల లోపు ఉన్న రైతుల కు 90 శాతం రాయితీతో, ఐదు ఎకరాల పైన ఉన్న రైతులకు 70 శాతం రాయితీతో డ్రిప్స్ పరికరాలను అందజేస్తుందన్నారు. స్ప్రింకర్లు ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులకు 55 శాతం రాయితీ, ఆ పైన ఉన్న రైతులకు 45 శాతం రాయితీతో పరికరాలను అందజేస్తుందని తెలిపారు. డ్రిప్స్, స్ప్రింకర్లు కావాల్సిన రైతులు సమీప రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేల అధికారులు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో సూక్ష్మ సేద్య అధికారి సత్యనారాయణ, వవ్యసాయ సహాయ సంచాలకులు ఆంజనేయ, వ్యవసాయ అధికారి విష్ణు వర్ధన్ రైతు భరోసా సిబ్బంది, ఆయా కంపినీల ప్రతినిధులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పేదలకు వరం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నందికొట్కూరు

జగనన్న సురక్ష పథకం పేద ప్రజలకు వరం లాంటిదని ఎమ్మెల్యే ఆర్థర్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్న సురక్ష పథకాన్ని నెలరోజుల పాటు అన్ని సచివాలయాల పరిధిలో నిర్వహించామన్నారు. నందికొట్కూరు నియోజకవర్గంలో 86 సచివాలయ పరిధిలో 86,229 కుటుంబాలను వాలంటీర్లు కలిసి 49,352 మందికి సర్టిఫికెట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ గంగిరెడ్డి రమాదేవి , రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ హాజీ అబ్దుల్ షకూర్ , మున్సిపల్ వైస్ చైర్మన్ మొల్ల రబ్బాని, నాయకులు ఉండవల్లి ధర్మారెడ్డి , మొల్ల జాకీర్ హుస్సేన్ , నందికొట్కూరు సింగిల్ విండో చైర్మన్ సగినేల హుస్సేనయ్య , పట్టణ మహిళా ప్రధాన కార్యదర్శి డాక్టర్ వనజ తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డుకు భూమి పూజ

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని పలుకూరు గ్రామంలో ఓసి కాలనీలో మండల పరిషత్ స్కూల్ నుంచి దాసి తిరుపాల్ రెడ్డి ఇంటి వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణానికి వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గుండం శేషి రెడ్డి మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలు మరల నిలవాలంటే రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మళ్ళీ సిఎంగా, నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కషి చేస్తున్న కాటసాని రామిరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు గుండం పక్కిరరెడ్డి, దాసి తిరుపాల్ రెడ్డి, ఉపసర్పంచ్ శివకృష్ణ, దండగల వెంకట స్వామి, సచివాలయ కన్వీనర్ వెంకటేష్, సురేష్, చాకలి తిమ్మయ్య, చాకలి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


సిసి రోడ్డుకు భూమి పూజ నిర్వహిస్తున్న వైసిపి రాష్ట్ర కార్యదర్శి గుండం శేషి రెడ్డి

మణిపూర్ ఘటనపై మొహం చాటేసిన మోడీ

- బస్సు జాతాను జయప్రదం చేయండి : సిపిఐ

ప్రజాశక్తి - నంద్యాల

మణిపూర్ సంఘటనపై పార్లమెంట్లో సమాధానం చెప్పలేక ప్రధాని నరేంద్ర మోడీ మొహం చాటేశారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు జి. ఓబులేసు, పి. రామచంద్రయ్య, జగదీష్‌లు విమర్శించారు. సుప్రీంకోర్టు ఆక్షేపిస్తున్నా ప్రధాని మోడీలో చలనం లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. స్థానిక కార్యాలయంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు శరవేగంగా మారుతున్నాయన్నారు. కేంద్రంలోనిమోడీ ప్రభుత్వం ఎన్నికలకు ఇప్పటినుండే కసరత్తు ప్రారంభించిందన్నారు. గత కొన్ని రోజుల నుండి పార్లమెంటు, రాజ్యసభలు మణిపూర్ ఘటనపై ఎంపీలు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ప్రధాని మోడీ మొహం చాటేశారని, ప్రజలను పట్టిపీడిస్తున్న సమస్యలపై మోడీ ఎందుకు నోరు విప్పడం లేదని నిలదీశారు. ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం పెడితే ఈనెల 8న చర్చ, 10న మోడీ సమాధానం చెబుతామని అంటున్నారని వివరించారు. రాష్ట్రంలో జగన్ విధ్వంసక చర్యలకు పాల్పడుతున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సాగనంపేందుకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాయలసీమను రత్నాలసీమగా మారుస్తానని చంద్రబాబు ప్రాజెక్టుల పర్యటన బాట పట్టారని, మరి గతంలో అధికారంలో ఉన్నపుడు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ఆగస్టు 17న విశాఖ స్టీల్ ప్లాంట్ నుండి రాష్ట్ర వ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో బస్సు ప్రచార జాతా నిర్వహిస్తున్నామని, నంద్యాల జిల్లాలో జయప్రదం చేసేందుకు సిపిఐ శ్రేణులు సిద్ధం కావాలన్నారు. సెప్టెంబర్ 8న తిరుపతిలో భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.రామచంద్రయ్య మాట్లాడుతూ మోడీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, మతోన్మాద విధానాలను తిప్పి కొట్టాలన్నారు. సమావేశంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కి లెనిన్ బాబు, జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఓబులేసు

టిడ్కో కాలనీలో విద్యుత్ పనులు పూర్తి

- విద్యుత్ మీటర్లకు దరఖాస్తు చేసుకోండి : డిఇఇ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని టిడ్కో గృహాల సముదాయాలకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు పనులు పూర్తి అయినట్లు విద్యుత్ ఆళ్లగడ్డ సబ్ డివిజనల్ డిఈఈ రవికాంత్ చౌదరి తెలిపారు. బుధవారం టిడ్కో గృహాలలో ఉన్న రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ స్తంభాల పూర్తయిన పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు టిడ్కో గృహాలకు విద్యుత్ సౌకర్యం అందించేందుకు 29 బ్లాక్ లలో విద్యుత్ స్తంభాలు, లైన్లు పూర్తయ్యాయన్నారు. టిడ్కో గృహాల లబ్ధిదారులు విద్యుత్ సర్వీస్ మీటర్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. లబ్ధిదారులకు 48 గంటలలోపు విద్యుత్ సర్వీసును అందిస్తామన్నారు. దరఖాస్తు చేసుకోటానికి లబ్ధిదారుని ఆధార్ కార్డు, రెండు సెల్‌ఫోన్ల నెంబర్లు, వారి పాత ఇంటి విద్యుత్తు సర్వీస్ నెంబర్, కిరాయి ఇంటిలో నివసించే కరెంటు సర్వీస్ నెంబరు తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ విద్యుత్ ఏఈ కంబగిరి తదితరులు పాల్గొన్నారు.


టిడ్కో కాలనీలో విద్యుత్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న డిఈఈ

సమయపాలన పాటించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - రుద్రవరం

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీవో మధుసూదనరెడ్డి తెలిపారు. బుధవారం మందలూరు, ముత్తలూరు, నరసాపురం సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది తప్పనిసరిగాఉదయం 10:30 నుండి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయంలో ఉంటూ విధులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి దరఖాస్తులను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కార మార్గాలు చూపాలన్నారు. స్పందన దరఖాస్తులను నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలన్నారు. అనంతరం హౌసింగ్ లేఔట్లను పరిశీలించారు. నిర్మాణం పనులకు సంబంధించి వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పిఆర్ఏఈ వెంకట రాముడు,పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వందశాతం డీవార్మింగ్ చేయాలి

ప్రజాశక్తి - చాగలమర్రి

మండల వ్యాప్తంగా 2 నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ డీవార్మింగ్ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో మహబూబ్దౌలా, ఎంఈవో అనురాధ తెలియజేశారు. బుధవారం చాగలమర్రి పట్టణంలోని ఎంపీడీవో కార్యాయలంలో వైద్యులు ఇమ్రాన్ ఆధ్వర్యంలో దాదాపు 10011 డీవార్మింగ్ మాత్రలను ఎంపీడీవో, ఎంఈవోలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 2 నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగిన వారు 10041 మంది ఉన్నారని, ఈనెల 10న జాతీయ డీవార్మింగ్ సందర్భంగా వందశాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుదర్శన్రావు, హెల్త్ సూపర్వైజర్ రామలింగారెడ్డి పాల్గొన్నారు.

శానిటేషన్ పనుల్లో నిర్లక్ష్యం వద్దు : కమిషనర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలో శానిటేషన్ పనుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని, మరింత మెరుగ్గా చేయాలని మున్సిపల్ కమీషనర్ సి. రవి చంద్రారెడ్డి ఆదేశించారు. బుధవారం మునిసిపల్ కమిషనర్ శానిటరీ ఇన్స్పెక్టర్‌తో కలిసి శ్రీనివాస సెంటర్ , నునేపల్లి మెడికల్ కాలేజీ వద్ద రోడ్ సైడ్ ఉన్న మట్టిని తొలగించే పనులను, చౌక్‌లో ఉన్న మార్కెట్‌ను పరిశీలించారు. వర్షాకాలం నేపథ్యంలో డ్రైనేజీ కాలువలలో రోజువారీగా సిల్ట్ తీయాలన్నారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ 18, 20, 23 వార్డు సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. స్పందన గ్రీవెన్స్ రిజిస్టర్లు తనిఖీ చేసి సిబ్బందికి రిజిస్టర్ మెయింటనెన్స్, అటెండెన్స్, సర్వీస్ రిజిస్టర్ నిర్వహించాలని ఆదేశించారు.

ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి

- డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ జగదీశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

ముర్రుపాలు పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని జిల్లా ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమ అధికారి, డిప్యూటీ డిఎంహెచ్ఒ డా.జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని కైప సబ్ సెంటర్‌లో టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డా.శివ శంకరుడు ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రజలకు రక్త పోటు,మధుమేహం ,క్యాన్సర్ సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తల పై అవగాహన కల్పించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి .చార్మిల, ఏఎన్ఎం.అబిదా, టిబి అధికారి నర్సింహ, ఆశా వర్కర్లు, అంగన్వాడి టీచర్లు, ఆయాలు, సిబ్బంది పాల్గొన్నారు.

వెల్దుర్తి పింగళి వెంకయ్య జయంతి వేడుకలు

ప్రజాశక్తి- వెల్దుర్తి


పింగలి వెంకగయ్యకు నివాళి

వెల్దుర్తి గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిని కవితభాయి , వెల్దుర్తి గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు సాయి ప్రసాద్ ఆధ్వ ర్యంలో స్వాతంత్ర సమర యోధుడు జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా పూలమాలవేసి ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సాయిప్రసాద్ మాట్లాడుతూ దేశం కోసం తన జీవితాన్ని అంకితం చేసి జాతీయ జెండా రూపొందించడానికి విశేష కషి చేశారని ప్రపంచంలోని అన్ని దేశాల కంటే మహోన్నతంగా భారత జాతీయ జెండాను తీర్చిదిద్దిన మహోన్నతుడని ఆయన జీవితాన్ని యువతరం ఆదర్శంగా తీసుకొని తమ జీవితాలలో విజేతలుగా నిలవాలని కోరారు. గ్రంథాలయాధికారిని కవిత భాయి, వెల్దుర్తి గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు సాయిప్రసాద్, ఖాదర్‌బాష , గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

ఎన్నికల వర్క్ షాప్ కు హాజరైన జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

భారత ఎన్నికల కమిషన్ బుధవారం విశాఖపట్నంలో నిర్వహించిన ఎన్నికల వర్క్‌షాపునకు జిల్లా ఎన్నికల అధికారి , జిల్లా కలెక్టర్ జి.సృజన హాజరయ్యారు. జిల్లాలో చేపడుతున్న ఓటర్ల సవరణపై ఎన్నికల కమిషన్ ఉన్నతాధికారులకు నివేదించారు. ఓటర్ల జాబితా ఇంటింటి వెళ్లి పరిశీలన కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. 100శాతం పూర్తిస్థాయి ఓటర్ల జాబితాను తయారు చేయనున్నట్లు వెల్లడించారు.



శిథిలావస్టకు వంతెన

మరమ్మత్తులు మరచిన ప్రభుత్వం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలం బస్తిపాడు గ్రామ సమీపంలో ఉన్న వాగుపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకున్నది దానిని జనసేన నాయకులు అంజి వెంకటేష్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వంతెన నిర్మించి రోడ్డుకు ఇరువైపులా రక్షణ గోడను నిర్మించాలని జనసెన నాయకులు కోరారు. రక్షణ గోడ లేక వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు . ప్రమాదాలు జరగకముందే ఆర్ అండ్ బి అధికారులు స్పందించి మరమ్మత్తుల పనులు వెంటనే ప్రారంభించాలని కోరారు. గ్రామంలో ఉన్న పాఠశాల ముందు రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లను వేసి విద్యార్థులకు, ప్రజలకు,ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అంజి, వెంకటేష్, శీను,రఘు, మహేష్, శివ,అశోక్,రంగస్వామి,గిరి,తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేను తనిఖీ చేసిన తహశీల్దారు

ప్రజాశక్తి-మద్దికేర

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ భూముల రీసర్వే కార్యక్రమాన్ని బుధవారం తహశీల్దార్ నాగభూషణం తనిఖీ చేశారు. మాట్లాడుతూ హంప రెవెన్యూ గ్రామంలో మొత్తం 10095.95 విస్తీర్ణం ఉందని తెలిపారు. 10 టీముల సహకారంతో ప్రతిరోజు 800 ఎకరాలు చేస్తూ 6967.13 ఎకరాలు రీ సర్వే చేపట్టామని అన్నారు. ప్రతి రైతు పొలంలో సరిహద్దులు గుర్తించి సక్రమంగా రీసర్వే చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒలు సర్వేర్లు యజమానులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను ఎవరు విధ్వంసం చేశారో చెప్పాలి

జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్



మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రాజెక్టుల విధ్వంస యాత్ర పేరు పెట్టడమే పెద్ద విధ్వంసమని, రాయలసీమ ప్రాంత రైతులకు, ప్రజలకు ఒక్క ప్రాజెక్టు కూడా ప్రారంభించని చంద్రబాబు విధ్వంసం పేరు పెట్టుకుని యాత్రలు చేయడం విడ్డూరంగా ఉందని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. బుధవారం జిల్లా పరిషత్‌లోని ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాయలసీమ అభివృద్ధికి ఏమి చేశారో చంద్రబాబు ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన ప్రాజెక్టులవల్లే రాష్ట్రంలో,రాయలసీమ జిల్లాల్లో తాగు సాగు నీటికి కష్టాలు తీరాయన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్, ఎస్ఆర్‌బిసి,హంద్రీనీవా, జిఎన్ ఎస్ ఎస్, పోతిరెడ్డిపాడు, గాలేరు నగరి, ఇలాంటి ఎన్నో పథకాలు అభివృద్ధి చేసిన నేత రాజశేఖర్‌రెడ్డి అని అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ కూడా అందించిన ఘనత వైఎస్ఆర్‌ది మాత్రమే అన్నారు. 14 ఏళ్ళు అధికారంలో ఉన్న తమరు రాష్టానికి ఏమి వెలగపెట్టారో ఒక్కసారి ఆలోచించి మాట్లాడాలన్నారు. తండ్రికి తగ్గట్టుగానే జగన్మోహన్ రెడ్డి కుందూనది వైడనింగ్ పనులు, పోతిరెడ్డి పాడు రెగ్యులేటర్ 80 వేల క్యూసెక్కులకు పెంచడం, ఓర్వకల్ దగ్గర మల్లికార్జున రిజర్వాయర్ మొదలు పెట్టామన్నారు. ఒకపక్క సంక్షేమ పథకాలు చేస్తూ ఇంకో పక్కా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడంలో ఒక్క సారి ముఖ్యమంత్రిగా ఉంటేనే ఇన్ని చేశాడన్నారు.ఎన్నికల ముందు ఇలాంటి సమస్యలు పేరుతో రైతులకు ప్రజలకు దగ్గరవడం కోసమే ఇలాంటి బూటకపు మాటలు చెప్పడం కోసం యాత్రలు చేస్తున్నారన్నారు. ఇలాంటి మాటలు వినడానికి ప్రజలు సిద్ధంగా లేరన్నారు. 2014 తరువాత ముఖ్యమంత్రి అయ్యాక జిల్లాలో ఒక్క ప్రాజెక్టు కూడా చేయలేదు. 2019 ఎన్నికల ముందు మాత్రం గుండ్రేవుల రిజర్వాయర్ సిద్ధం చేస్తామని బూటకపు జిఒలను జారీ చేసి ప్రజలను మరోసారి మోసం చేశారన్నారు. 40 ఏళ్ల అనుభం కాదు ప్రజలకోసం రైతులకోసం రాష్ట్ర అభివృద్ధికోసం ఏమి చేశారో ఇప్పటికైనా ఆలోచించి ఇలాంటి యాత్రలు చేస్తే బాగుంటుందన్నారు. ప్రత్యేక హోదాను తీసుకురాలేదని, ప్రత్యేక ప్యాకేజి కూడా తీసుకురాలేదన్నారు. రాష్ట్రాన్ని రాష్ట్ర ప్రజల గురించి రైతాంగ గురించి ఆలోచించి న్యాయం చేసే ఒకే ఒక కుటుంబం వైఎస్ కుటుంబం అన్నారు. ఎప్పటికైనా ప్రజలకోసం ఏమి ఒరగబెట్టావో ఆలోచించి మాట్లాడాలని అన్నారు. ఇప్పటికీ ప్రాజెక్టుల విధ్వంసం చేస్తుంది... చేసింది ఎవరో తెలుసుకోవాలన్నారు.

ఈనెల 10 నుంచి విద్యుత్ ఉద్యోగుల నిరవధిక సమ్మె

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యుత్ ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కారం అయ్యేంతవరకు వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు చేద్దామని అప్పటికే పరిష్కారం చేయకపోతే ఈనెల 10 నుండి నిరవధిక సమ్మెలోకి వెళదామని విద్యుత్ జెఎసి చైర్మన్ బిఎన్. గణేష్, కార్యదర్శి బి. రంగస్వామిలు తెలిపారు. బుధవారం విద్యుత్తు భవన్ వద్ద రాష్ట్ర జెఎసి ఇచ్చిన పిలుపు మేరకు రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ రిలే నిరాహార దీక్షలో కర్నూలు, డోన్ డివిజన్లకు సంబంధించిన 60 మంది కార్మిక ,ఉద్యో గులు పాల్గొన్నారు. వీరికి సంఘీభావంగా విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగ, ఒప్పంద ,పొరుగు సేవల కార్మికులు పాల్గొని మా కోరికలు న్యాయమైనవి, విద్యుత్ జెఎసి జిందాబాద్, ఉద్యోగ కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి,మా సమస్యలను పరిష్క రించాలని నినదించారు. దీక్షలను ప్రారంభించిన జిల్లా విద్యుత్ జెఎసి చైర్మన్ బిఎన్‌గణేష్, కార్యదర్శి జి. రంగస్వామి వివిధ కార్మిక సంఘాల నాయకులు జెఎసి కో చైర్మన్ ఆనంద్ దేవపాల్, హెచ్. నాగశేషులు, దాంలానాయక్ లు మాట్లాడుతూ మన సమస్యలన్నీ పరిష్కారం అయ్యేంతవరకు ఆందోళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పరిష్కారం కానిచో నిరవధిక సమ్మెలోకి వెళ్లాల్సి ఉంటుందని తెలిపారు. ఒకటవ తేదీ జరిగిన విద్యుత్ ఉద్యోగుల మహా ర్యాలీ ద్వారా అయినా యాజమాన్యం, ప్రభుత్వం స్పందించి మాకు న్యాయం చేయాలని లేకపోతే భవిష్యత్తులో జరుగు పరిణామాలకు మమ్మల్ని బాధ్యులను చేయరాదని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు. ఇంజనీరింగ్ అసోసియేషన్ నుండి గంగన్న, కృష్ణ, ఎస్సీ ఎస్టీ యూనియన్ నుండి హుసేని , బిసి అసోసియేషన్ నాయకులు రామరాజు, మైనార్టీ యూనియన్ నాయకులు సయ్యద్ బాష, నాయకులు వై భాస్కర్ రావు, రామకృష్ణ, కర్నూలు డివిజన్ జెఎసి నాయకులు మధు, కృష్ణ, బహుజన అసోసియేషన్ నాయకులు సుధాకర్ లు పాల్గొన్నారు.


దీక్షలను ఉద్దేశించి మాట్లాడుతున్న జెఎసి చైర్మే బిఎన్.గణేష్

జగనన్నతోనే పేదల అభ్యున్నతి : ఎమ్మెల్యే శ్రీదేవి

ప్రజాశక్తి-తుగ్గలి



రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తోనే పేదల అభ్యున్నతి సాధ్యమని, అలాగే సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని ఏర్పాటు చేశారని పత్తికొండ ఎమ్మెల్యే శ్రీ దేవి అన్నారు. మాజీ ఎమ్మెల్యే తమ్మారెడ్డి కుమారుడు శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపిటిసి సావిత్రమ్మ , సహకార సంఘం అధ్యక్షురాలు విజయలక్ష్మి, స్థానిక వైసిపి నాయకులు మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, ఎంపిటిసి రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు రైతులకు రుణమాఫీ చేస్తానని, పొదుపు సంఘాల మహిళలకు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను మాఫీ చేస్తానని హామీ ఇచ్చి వాటిని అమలు చేయలేదన్నారు. వైఎస్.జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి అయిన వెంటనే అమలు చేశారని ఆమె ప్రజలకు వివరించారు. అందువల్ల మరోసారి వైఎస్. జగన్మోహన్ రెడ్డి ను ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నందుకు ప్రజలందరూ ఆశీర్వదించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు నాయక్, విఆర్ఓ రహిమాన్, మైనార్టీ వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ టిఎండి. హుసేని, సహకార సంఘం అధ్యక్షులు అట్లా గోపాల్ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు చాంద్ బాషా, వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ సోమశేఖర్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ జిట్టా నగేష్ యాదవ్, సచివాలయ మండల కన్వీనర్ హనుమంతు, వైఎస్ఆర్ నాయకులు ఎర్రగుడి రామచంద్రారెడ్డి, రాతన మోహన్ రెడ్డి, జగన్నాథ్ రెడ్డి, నాగభూషణ్ రెడ్డి, ఉమా మహేశ్వర్ రెడ్డి, లలితా రామచంద్ర,పురుషోత్తం, సచివాలయం ఆరోగ్య కార్యదర్శి మహాలక్ష్మి పాల్గొన్నారు.


వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పిస్తున్న కెఇ.కృష్ణమూర్తి, బిటి.నాయుడు, కెఇ శ్యామ్‌బాబు

బిపి నాయుడుకు ఘన సన్మానం

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ పట్టణంలోని గోపాల్ ఫంక్షన్ హాల్‌లో వాల్మీకి బోయ సామాజిక వర్గానికి చెందిన వారు బుధవారం నూతనంగా ఎన్నికైన టిడిపి జిల్లా అధ్యక్షుడు బిటి నాయుడుకు పూలమాలవేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి టిడిపి పొలిటి బ్యూరో, మాజీ డిప్యూటీ సీఎం కెఇ.కృష్ణమూర్తి, పత్తికొండ నియోజకవర్గం ఇన్చార్జి కెఇ. శ్యాంబాబు పాల్గొని వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు కడవల సుధాకర్, మాజీ జెడ్పిటిసి బత్తిని వెంకట రాముడు, బిటి గోవిందు, రామానాయుడు, ఈరమ్మ. తిరుపాల, బోయ కులస్తుల పెద్ద ఎత్తున పాల్గొన్నారు..



ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఎపి ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ఈ విద్యా సంవత్సరంలో టెన్త్ , ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య పేర్కొన్నారు. బుధవారం జాయింట్ కలెక్టర్ తన చాంబర్లో ఓపెన్ స్కూల్ ప్రదేశాలకు సంబంధించి వాల్ పోస్టర్లను జాయింట్ కలెక్టర్ , జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట్ రంగారెడ్డి, జిల్లా పరీక్షల విభాగం కోఆర్డినేటర్ చంద్రభూషణ్ కుమార్ పాల్గొన్నారు. ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై విస్తృతంగా ప్రచారం కల్పించాలని జాయింట్ కలెక్టర్ విద్యాశాఖ అధికారిని ఆదేశించారు

ఐఎఎస్ఇలో రెండు రోజుల వర్క్ షాప్ ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూల్ కలెక్టర్

నగరంలోని స్థానిక బీక్యాంపులో గల ఐఎఎస్ఈ కళాశాలలో రెండు రోజుల జాతీయ వర్క్ షాప్ బుధవారం ప్రారంభమైంది. ఇంటరాక్టివ్ టీచింగ్ అండ్ యాక్టివ్ లెర్నింగ్ స్ట్రాటజీస్ ఫర్ టీచర్ ట్రైనీస్అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ఆదినారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య వక్త గా బెంగళూరుకు చెందిన ప్రొఫెసర్ కరిమా అంజూమ్, సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి వి సుబ్రహ్మణ్యం కుమార్, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకులు సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సదస్సులో పలు అంశాలపై వారు వివరించారు.

మహాపాదయాత్ర దృశ్యమాలిక

కదిలింది అరుణసైన్యం

సిపిఎం చేపట్టిన మహా పాదయాత్రను కర్నూలు జిల్లా ఆదోనిలో బుధవారం ప్రారంభమైంది. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ అధ్యక్షతన సాగు, తాగు నీరు ఇచ్చే వరకు పోరాటం సాగిస్తాన్నారని అన్నారు. పాదయాత్రకు సిపిఐ, కాంగ్రెస్, ఆర్‌సిసి నాయకులు మద్దతు తెలిపారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, కాంగ్రెస్ ఆదోని ఇంచార్జీ ప్రకాష్, ఆర్‌సిసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి, సాగునీటి సాధన పోరాట నాయకులు ఆదినారాయణ రెడ్డి, బిసి సంఘం రాష్ట్రఉపాధ్యక్షులు దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం గఫూర్ జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు.

ఆదోని పాత బస్టాండ్ నుండి ప్రారంభమైన పాదయాత్ర భీమాస్ కూడలి, ఎమ్మిగనూరురోడ్డు కూడలి, తిక్కస్వామి దర్గా, ఆర్ట్స్ కాలేజి, బైచిగేరి క్రాస్, అరేకల్ మీదుగా బనవాసి ఫారం వరకు సాగింది. గురువారం బనవాసి ఫారం నుండి హనుమాపురం, ఎమ్మిగనూరు మీదుగా గోనేగండ్ల వరకు సాగనుంది.



కర్నూలు జిల్లా ఆదోనిలో సిపిఎం మహాపాదయాత్ర ప్రారంభిస్తున్న ఎంఏ.గఫూర్ , పాల్గొన్న నాయకులు , కార్యకర్తలు


కర్నూలు జిల్లా ఆదోనిలో బహిరంగ సభలో అభివాదం చేస్తున్న సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ ప్రజాసంఘాల నాయకులు


కర్నూలు జిల్లా ఆదోనిలో కదంతొక్కుతున్న ఎర్రసైన్యం



కర్నూలు జిల్లా ఆదోనిలో బహిరంగ సభలో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్



కర్నూలు జిల్లా ఆదోనిలో మహాపాదయాత్ర అగ్రభాగాన మహిళా నేతలు



కర్నూలు జిల్లా ఆదోనిలో మహాపాదయాత్రకు పూలవర్షం కురిపిస్తున్న ప్రజలు


పాదయాత్రలో డి.గౌస్‌దేశాయ్, ఆనంద్‌బాబు, గురుశేఖర్ తదితరులు



అభ్యుదయ గీతాలు ఆలపిస్తున్న పిఎన్ఎం కళాకారులు రాజు, బస్వరాజు, బతకన్న తదితరులు





మాట్లాడుతున్న జిల్లా ఎస్పి కె.రఘువీర్ రెడ్డి

అధికార లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు

- పాల్గొన్న ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్, నాయకులు, ఆర్మీ, ప్రభుత్వ అధికారులు



వీర జవాన్ సురేంద్ర తల్లిదండ్రులకు జాతీయ పతకాన్ని అందజేస్తున్న ఆర్మీ అధికారులు, (ఇన్‌సెట్‌లో వీర జవాన్ సిరిగిరి సురేంద్ర (ఫైల్)

ప్రజాశక్తి - పాములపాడు

జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో వీర మరణం పొందిన జవాన్ సిరిగిరి సురేంద్ర అంత్యక్రియలు బుధవారం పాములపాడు మండలం మద్దూరు మజరా గ్రామం కృష్ణానగర్ గ్రామంలో అధికారిక లాంఛనాలతో జరిగాయి. నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్, తహశీల్దార్ రత్న రాధిక, ఎంపీడీవో గోపికృష్ణ, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు కృష్ణానగర్ గ్రామానికి చేరుకుని వీరజవాన్ భౌతికకాయంపై పుష్పగుచ్ఛాలు ఉంచి గౌరవ వందనం చేశారు. వీర జవాన్‌ను కడసారి చూసేందుకు వివిధ గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో వచ్చారు. ఎమ్మెల్యే ఆర్థర్ జవాన్ పాడే మోశారు. ఎస్సీ, ఎస్టీ డిఎస్పి రామాంజనేయ ఆధ్వర్యంలో ఏఆర్ పోలీసుల బృందం గాలిలోకి కాల్పులు చేసి గౌరవ వందనం చేశారు. అనంతరం సైనిక అధికారులు సబ్బాడెన్ ఎంఎం రెడ్డి (ఎల్/ఎన్‌కె)మాధవ్, సుమేధర్, రవీంద్ర సింగ్‌లు పుష్పగుచ్ఛాలు ఉంచి సెల్యూట్ చేసి సైనిక వందనం చేశారు. జాతీయ పతాకాన్ని వీర జవాన్ సురేంద్ర తల్లిదండ్రులు సుబ్బమ్మ, సుబ్బయ్యలకు అప్పజెప్పారు. కస్టమ్స్ ఆఫీసర్ వేల్పుల ఆనంద్, ఎన్‌సిసి నంద్యాల సైనిక్ అసోసియేషన్ రంగనాయకులు, కర్నూలు ఉమ్మడి అసోసియేషన్ అధ్యక్షులు సుధాకర్, నేషనల్ డిఫెన్స్ వెట్రన్స్ ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కర్నూల్ సీనియర్ సైనిక్ ఆఫీసర్ ఏఆర్ రత్నరుత్, పుష్పలత, క్యామెరిసన్ కెప్టెన్ మద్దిలేటి తదితరులు పుష్పగుచ్ఛాలు ఉంచి సెల్యూట్ చేశారు. అంత్యక్రియల్లో ఆత్మకూరు సిఐ నాగభూషణం, పాములపాడు ఎస్సై జి.అశోక్, మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని నివాళులర్పించారు.

జవాన్ కుటుంబాన్ని ఆదుకుంటాం : ఎమ్మెల్యే

వీర జవాన్ సురేంద్ర కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే ఆర్థర్ తెలిపారు. ప్రభుత్వం నుండి రావాల్సినవనీ కుటుంబానికి అందేలా చూస్తానన్నారు. దేశం కోసం మరణించిన సురేంద్ర చిరస్మరణీయుడని అన్నారు.

కుమారుని మరణం గౌరవంగా ఉంది : తల్లిదండ్రులు

దేశ రక్షణలో భాగంగా తమ కుమారుడు చనిపోవడం తమకు ఎంతో గౌరవంగా ఉందని సురేంద్ర తల్లిదండ్రులు సుబ్బయ్య, సుబ్బమ్మ తెలిపారు. అవకాశం వస్తే తమ పెద్ద కుమారుని కూడా ఆర్మీకి పంపిస్తామన్నారు.



గాల్లోకి కాల్పులు చేస్తున్న పోలీసులు



వీర జవాన్‌కు నివాళ్లులర్పిస్తున్న ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- మైనర్లకు, లైసెన్స్ లేని వారికి వాహనాలు ఇస్తే యజమానులకు శిక్ష
- జిల్లా ఎస్పి కె.రఘువీర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పి కె.రఘువీర్ రెడ్డి హెచ్చరించారు. జూలై నెలలో జిల్లా వ్యాప్తంగా పోలీసులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో తీసుకున్న చర్యల వివరాలను జిల్లా ఎస్పీ బుధవారం మీడియాకు విడుదల చేశారు. ఎస్పి మాట్లాడుతూ మైనర్లకు, లైసెన్స్ లేనివారికి ఏదైనా వాహనం ఇస్తే ఏదైనా ప్రమాదం జరిగితే వాహన యజమానిపై కేసు నమోదు చేస్తామన్నారు. రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన చేసేలా చర్యలు చేపట్టాలని, జరిమానాల కంటే అవగాహన కల్పించడం ముఖ్యమన్నారు. జులై నెలలో డ్రైవింగ్ లైసెన్సులు లేని కేసులు830, హెల్మెట్ 2,271, మైనర్లపై 69, వన్ వేలో రాంగ్ రూట్ 12, మొబైల్ మాట్లాడుతూ 560, జంపింగ్ సిగ్నల్ 45, ఏలాంటి రికార్డులు పత్రాలు లేనివి 1309, సీటు బెల్టు ధరించనవి 158, అతి వేగం 85, ఓవర్ లోడ్ 44, ట్రిబుల్ రైడింగ్ 1774, రాంగ్ పార్కింగ్ టూ వీలర్ 2965, త్రీ, ఫోర్ వీలర్ 1516, డ్రంకెన్ డ్రైవింగ్ 404 కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. మొత్తం రూ.4 లక్షల 86 వేల 814 ఈ-చలానాలు పెండింగ్‌లో ఉన్నాయని, గత నెలలో 1011 (రూ.2 లక్షల 66 వేల 885) రికవరీ చేశామన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరిగినా, రహదారులపై ఇబ్బందికరంగా వాహనాలు నిలిపినా వెంటనే డయల్ 100కు సమాచారం ఇచ్చి జిల్లా ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

పారిశుధ్య కార్మికులకు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసురత్నం

ప్రజాశక్తి - కొత్తపల్లి

గ్రామాల్లో మురుగు, చెత్తను ప్రతిరోజు శుభ్రపరిచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న స్వచ్ఛభారత్ గ్రామీణ పారిశుధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించి, కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.యేసురత్నం, పారిశుధ్య కార్మికుల సంఘం మండల అధ్యక్షులు స్వాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కొత్తపల్లిలో ఎంపీడీవో మేరీ, జడ్పిటిసి సుధాకర్ రెడ్డికి సిఐటియు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు నెల నెలా గ్రామపంచాయతీ నిధుల నుండి జీతాలు చెల్లించాలని జీవోలు ఉన్నప్పటికీ అమలు కావడం లేదన్నారు. 15 నెలలుగా వేతనాలు అందకపోతే కార్మికులు కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. పారిశుధ్య కార్మికులు ట్రై సైకిళ్ల సైతం మరమ్మతులకు గురైతే సొంత ఖర్చులతో బాగు చేయించుకోవాల్సి వస్తుందన్నారు. కార్మికులకు రక్షణ పరికరాలైన గ్లౌజులు, బూట్లు, మాస్కులు, సబ్బులు, నూనెలు, శానిటైజర్ వస్తువులు ఇవ్వకుంటే వాళ్లు ఏ విధంగా పని చేస్తారని ప్రశ్నించారు.

ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన జీవోలను అమలు జరిపి, 15 నెలలుగా పెండింగ్లో ఉన్న జీతాలను 15 ఆర్థిక సంఘం నిధుల నుండి చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు, గ్రీన్ అంబాసిడర్లు రాజారావు, రవి, మల్లేష్, తిరుపాలు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



జడ్పిటిసి, ఎంపిడిఒలకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

రేడియల్ క్రస్ట్‌గేట్లకు చేరిన నీటిమట్టం

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం జలాశయానికి వరద నీటి ప్రవాహం కొనసాగుతుండడంతో బుధవారం నీటిమట్టం ఆనకట్ట రేడియల్ క్రస్ట్‌గేట్లకు చేరుకుంది. కృష్ణా ఎగువ పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వలన జూరాల నుండి 77,921 క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 886 క్యూసెక్కులతో కలిపి 78,807 క్యూసెక్కుల నీరు వచ్చి జలాశయానికి చేరుతున్నాయి. బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయ నీటిమట్టం 854.10 అడుగులుగా, నీటి నిల్వ సామర్థ్యం 89.5016 టిఎంసిలుగా నమోదయింది. అలాగే తెలంగాణ పరిధిలోని భూగర్భ జల విద్యుత్తు కేంద్రంలో అవసరం మేరకు గడచిన 24 గంటలలో 417 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుని 0.247 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని చేశారు. కుడిగట్టు జల విద్యుత్తు కేంద్రంలో విద్యుత్ ఉత్పాదనను చేయడం లేదని గేజింగ్ సిబ్బంది తెలిపారు.



శ్రీశైలం డ్యామ్

వైఎస్ఆర్ సంపూర్ణ పోషణతో రక్తహీనత నివారణ

- పోషణ కార్యక్రమం ప్రారంభోత్సవంలో వక్తలు
- గర్భిణులకు, బాలింతలకు పోషణ కిట్లు పంపిణీ



వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ ద్వారా గర్భిణులు, బాలింతల్లో, చిన్నారుల్లో పోషకాలు పెంపొందించి రక్తహీనతను నిరోధించవచ్చని పలువురు వక్తలు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో మైనారిటీ వెల్ఫేర్ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, డిఆర్ఒ పుల్లయ్య, జిల్లా మహిళా శిశు సాధికార అభివృద్ధి అధికారిని నిర్మల, డిఎంహెచ్ఒ వెంకటరమణ, డిఎస్ఒ వెంకట రాముడు, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ రాజులు వైయస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా 300 మంది గర్భవతులకు, బాలింతలకు వైయస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. ఇందులో భాగంగా తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని కూడా నిర్వహించి అనంతరం పదిమంది చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం చేయించారు. కార్యక్రమంలో వరల్డ్ విజన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ తిరుపతి రావు, మదర్ సొసైటి రామారావు, బర్డ్స్ సొసైటీ వెంకటేశ్వర్లు, నంద్యాల ప్రాజెక్ట్ సీడీపీఓ టిఆర్‌యం, చంద్రకళ, ఏసీడీపీఓ వై.పద్మావతి దేవి, సూపర్వైజర్స్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** అంగన్వాడీ సెంటర్‌ల నుంచి అందిస్తున్న వైయస్సార్ ప్లస్ సంపూర్ణ పోషణ పథకాన్ని గర్భవతులు, బాలింతలు తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని ఎమ్మెల్యే ఆర్థర్ తెలిపారు. ఐసిడిఎస్ ఆవరణలో సిడిపిఓ కోటేశ్వరమ్మ అధ్యక్షతన ఇంటింటికి వైయస్సార్ ప్లస్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఉప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శోభారాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, వైసిపి రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి వనజ, కౌన్సిలర్ ధర్మారెడ్డి, దేశెట్టి శ్రీనివాసులు, గంగిరెడ్డి రమాదేవి తదితరులు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** మాత శిశు మరణాలు తగ్గించేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అంగన్వాడీ కేంద్రాల్లో వైయస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలోని సద్దాంకాలనీలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమాన్ని ప్రారంభించి గర్భవతులకు, బాలింతలకు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి గజ్జల రాఘవేంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, కౌన్సిలర్ షేక్ ఆజాద్, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ నరసింహారెడ్డి, (మిగతా 6వ పేజీలో..)



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని నాలుగవ సచివాలయ పరిధిలోని 4వ వార్డ్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వార్డులోని ప్రజలకు సంక్షేమ పథకాల గురించి వివరించారు. వార్డ్‌లో మౌలిక సదుపాయాల గురించి తెలుసుకుంటూ ముందుకు సాగారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, ఎంపిపి గజ్జల రాఘవేంద్ర రెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ నాయబ్ రసూల్, వైసిపి సీనియర్ నాయకులు దాల్‌మిల్ అమీర్ బాష, దాల్‌మిల్ హాజీ గఫూర్, హాజీ గౌసేపీర్, ఖాజా పీర్, కౌన్సిలర్ సుధాకర్ రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ గోపవరం నరసింహా రెడ్డి, ఎలక్ట్రికల్ ఏఈ కంబగిరి, మున్సిపల్ ఏఈ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు పర్యటన విజయవంతం

ప్రజాశక్తి - పగిడ్యాల

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు నందికొట్కూరు పర్యటన విజయవంతమైనందుకు ఎంతో సంతోషంగా ఉందని ఆ పార్టీ నంద్యాల పార్లమెంటు తెలుగు యువత నాయకులు మద్దిలేటి గౌడ్, షమీన్, గోవిందు అన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టు విధ్వంసంపై యుద్ధం కార్యక్రమంలో రాష్ట్ర ప్రాజెక్టుల సందర్శనలో భాగంగా టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, నంద్యాల పార్లమెంటు ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి ఆధ్వర్యంలో నందికొట్కూర్ నియోజవర్గంలో మంగళవారం ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం, బానకచెర్ల రెగ్యులేటర్‌లను సందర్శించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా, నియోజకవర్గ నాయకులకు, ప్రజలకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి

వైద్య ఆరోగ్య శాఖ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపి వైద్య విధాన పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు గిరి శివ శంకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపి వైద్య విధాన పరిషత్, ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్యశాఖ, నంద్యాల జిల్లా మెడికల్ కళాశాల, జిల్లా జనరల్ హాస్పిటల్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ బుధవారం స్థానిక కలెక్టరేట్ వద్ద రిలే దీక్షలు చేపట్టారు. దీక్షలను ఎపి వైద్య విధాన పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు గిరి శివ శంకర్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. అవుట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న ప్రతి ఒక్క ఉద్యోగికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. పీఆర్సీ 2010, 2014 రాష్ట్ర విభజనకు ముందు రెగ్యులర్ ఎంప్లాయిస్ వస్తున్న బేసిక్ పే ఇచ్చేవారన్నారు. ఇప్పుడు కూడా అదే విధంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగులకు కన్సాలిడేటెడ్ జీతం మాత్రమే ఇస్తున్నారని, ఆలా కాకుండా పీఆర్సీ 2010, 2014 రాష్ట్ర విభజనకు ముందు 100 శాతం గ్రాస్ ఇచ్చే విధంగా అమలు చేయాలన్నారు. నోటిఫికేషన్, మెరిట్, రోస్టర్ ద్వారా ఎంపిక చేయబడి 5 సంవత్సరాలు పైబడి పనిచేస్తున్న ప్రతి కాంట్రాక్ట్ ఉద్యోగస్తునికి రెగ్యులర్ చేయ్యాలని కోరారు. ఏ కారణం చేతనైన మరణిస్తే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. హెల్త్ కార్డ్ సదుపాయం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అన్ని రకాల సెలవుల సౌకర్యం కల్పించాలని సూచించారు. మెడికల్, హెల్త్ డిపార్టమెంట్ ఉద్యోగస్తులకు (సంపాదించిన సెలవు, హెచ్ పీఎల్ సెలవు తప్ప) అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.



రిలే దీక్షలు చేపడుతున్న అవుట్ సోర్సింగ్ కాంటాక్ట్, ఉద్యోగులు

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వీడాలి : జడ్పిటిసి

ప్రజాశక్తి - కొత్తపల్లి

గ్రామాల్లో సచివాలయ సిబ్బంది ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వీడాలని, పని చేయని సిబ్బందిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని జడ్పిటిసి సోమల సుధాకర్ రెడ్డి, ఎంపిపి కుసుమలత అన్నారు. బుధవారం కొత్తపల్లిలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఆధ్వర్యంలో మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు తమ శాఖల పరిధిలో ప్రగతి నివేదికలను వివరించారు. అనంతరం దుద్యాల సర్పంచ్ చందమాల శోభలత మాట్లాడుతూ సచివాలయ అధికారులు ప్రజా ప్రతినిధులను పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ప్రజల పట్ల అధికారులు అమర్యాదగా ప్రవర్తించడం సరైనది కాదన్నారు. ప్రజాప్రతినిధులకే పనులు చేయని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు. జడ్పిటీసీ, ఎంపీపీ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజా ప్రతినిధులు, ప్రజల సమస్యల పట్ల స్పందించి పనులు చేయాలన్నారు. నిర్లక్ష్యం వీడకపోతే జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. సమావేశంలో ఎంపిడిఒ మేరి, డిప్యూటీ తహసిల్దార్ పెద్దన్న, ఏపీఎం పుల్లయ్య, ఎంఇఒ శ్రీరాములు, ఏపీవో రేష్మ, వైద్యాధికారులు దీపా, నాగవేణి, సౌజన్య, జుబేదా, సర్పంచులు లక్ష్మీదేవి, జమీలాబీ, సరస్వతి, విజయ్, విజయ్ కుమార్, మారెన్న, నిత్య లక్ష్మీదేవి, బాల ఎల్లయ్య, వైస్ ఎంపీపీ 2 జయమ్మ, ఎంపిటీసీలు ముబీనా బేగం, స్రవంతి, శివన్న, బాలరాజు, కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ గౌస్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్పిటిసి

పారదర్శక జాబితాకు సహకరించాలి

- పెండింగ్ పరిశీలనను పూర్తి చేయండి : డిఆర్ఒ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

తప్పులు లేని పారదర్శక ఓటర్ల జాబితా రూపకల్పన నిమిత్తం బిఎల్ఓలకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఓటర్ల జాబితా సవరణపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం గత నెల 21వ తేదీ నుండి బిఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి ఓటర్ల వివరాలను పరిశీలిస్తున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్లను నియమించడంతోపాటు పారదర్శక ఓటర్ల జాబితాకు సహకరించాలన్నారు. పెండింగ్లో ఉన్న ఇంటింటి సర్వేను నిర్ణీత కాలంలో పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఈఆర్ఓ, ఏఈఆర్ఓలను ఆదేశించారు. బూత్ స్థాయి అధికారులు వాలంటీర్లతో కూడి ఇంటింటి సర్వే చేపడుతున్నారని రాజకీయ పార్టీల నాయకులు డిఆర్ఒ దృష్టికి తీసుకువచ్చారు. తగు చర్యలు తీసుకోవాలని ఈఆర్వో, ఏఈఆర్ఓలను డిఆర్ఒ ఆదేశించారు. ఓటరు జాబితాలో చనిపోయిన ఓట్లను తొలగించడంతోపాటు గిరిజన ప్రాంతాలలో ఉన్న ఓట్లను పరిశీలించి నమోదు చేయాలని వారు కోరారు. ఓటర్ల జాబితాలో చేర్పులు మార్పులు, తొలగింపులు, స్త్రీ పురుష నిష్పత్తి, బోగస్ ఓట్లు ఒకే ఇంట్లో 10 ఓటర్లకు మించిన కుటుంబాలు తదితర అంశాలపై క్షుణ్ణంగా పరిశీలిస్తారన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో బిఎల్ఓను యూనిట్‌గా తీసుకుని పారదర్శకంగా పరిశీలించి ఓటర్ల జాబితాలో నమోదు చేస్తామన్నారు. ఇందుకు సంబంధించి బూత్ స్థాయి ఏజెంట్లు కూడా పారదర్శక ఓటర్ల జాబితా రూపకల్పనకు సహకరించాలని కోరారు. సమావేశంలో అన్ని నియోజకవర్గాల ఈఆర్వో, ఏఈఆర్వోలు, బిజెపి తరపున ఎం.గంగాధర్, సిపిఐ ఎన్.రంగనాయుడు, సిపిఎం టి.రమేష్ కుమార్, కాంగ్రెస్ సయ్యద్ రియాజ్ భాష, టిడిపి నరేంద్ర కుమార్, వైసిపి అనిల్ అమృతరాజ్, సాయిరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న డిఆర్ఓ పుల్లయ్య



గోగిశెట్టి నరసింహారావుతో నాయకులు

వీరారెడ్డిపల్లె కేంద్రంగా జోరుగా రాజకీయాలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని సిరివెళ్ల మండలం వీరారెడ్డిపల్లె గ్రామం కేంద్రంగా రాజకీయాలు జోరుగా సాగుతున్నాయి. హైకోర్టు సీనియర్ న్యాయవాది గోగిశెట్టి నరసింహారావును మాజీ మంత్రి ఎన్ఎండి ఫరూఖ్ తనయుడు టిడిపి యువ నాయకుడు ఎన్ఎండి ఫిరోజ్ ఆయనను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గోగిశెట్టి నరసింహారావుతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నంద్యాల జిల్లా సంబంధించి పలు విషయాలు చర్చించారు. అనంతరం తన తండ్రి ఎన్ఎండి ఫరూఖ్ ఆహ్వానం మేరకు ప్రత్యేకంగా తమ ఇంటికి రావలసిందిగా ఆయనను కోరారు. తప్పకుండా కలుస్తానని గోగి శెట్టి నరసింహారావు హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా గోగిశెట్టి నరసింహారావును నియోజకవర్గంలోని కొంతమంది నాయకులు వీరారెడ్డి పల్లెకు వెళ్లి కలిశారు. నియోజకవర్గంలో అత్యధిక ఓటు బ్యాంకు కలిగిన బలిజ సామాజిక వర్గానికి చెందిన గోగి శెట్టి నరసింహారావు ఇటీవలే చంద్రబాబుని కలిశారు. దీనికి తోడు టిడిపి నాయకులు గౌరు వెంకట్ రెడ్డి, మాండ్ర శివానందరెడ్డిని బుధవారం నరసింహారావు కలిశారు. దీనిని బట్టి చూస్తే గోగిశెట్టి నరసింహారావు త్వరలోనే టిడిపి తీర్థం పుచ్చుకొనే అవకాశం ఉన్నట్టు తెలుస్తుంది. రాబోయే ఎన్నికల్లో ఆళ్లగడ్డ అసెంబ్లీ లేదా నంద్యాల పార్లమెంటు టికెట్ ఆశిస్తున్నట్లు తెలిసింది. సమావేశంలో సింగం భరత్ రెడ్డి, ఆర్ల నాగ శ్రీనివాసులు, మోహన్ రెడ్డి,శేఖర్ రెడ్డి, రాంపుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వాలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - అవుకు

అవుకు మండలంలో మూడు వాలంటరీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని మెట్టుపల్లి, చెర్లోపల్లి, మన్నేనాయక్ తండా పంచాయతీలలో ఖాళీగా ఉన్న మూడు వాలంటరీ పోస్టులకు ఆయా గ్రామాల యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను మండల పరిషత్ కార్యాలయంలో అందించాలని తెలిపారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ గంగుల ప్రతాప రెడ్డి

శ్రీశైలం జలాలను సద్వినియోగం చేసుకోవాలి

- మాజీ ఎంపీ గంగుల ప్రతాపరెడ్డి

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు : శ్రీశైలం జలాశయం నుండి ఇరు రాష్ట్రాలు సమానంగా నీటిని సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల మాజీ ఎంపీ గంగుల ప్రతాపరెడ్డి అన్నారు. బుధవారం శ్రీశైలం ఆనకట్టను ఆయన పరిశీలించారు. నీటి నిలువలను చూసి ఆశాభావాన్ని వ్యక్తపరిచారు. అనంతరం ఆనకట్టపై విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇరు రాష్ట్రాల ప్రజలు ఇబ్బంది పడకుండా నీటి వినియోగం చూడాల్సిన బాధ్యత ముఖ్యమంత్రులపై ఉందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చేపడుతున్న పనులలో చెరువుల పొడవు, వెడల్పులు పెంచు కోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎగువ రాష్ట్రాల్లో ఉన్న జలాశయాలు పూర్తిస్థాయికి చేరుకున్నాయని, ప్రస్తుత నీటి మట్టం చూస్తూంటే మరో వారం రోజులలో జలాశయం పూర్తిస్థాయికి చేరుకునే అవకాశం ఉందని వివరించారు. రాయలసీమ వాసులు జలాశయం ఎప్పుడు నిండుతుందా అని ఎదురు చూస్తున్నారని అన్నారు. జలాశయంలో పేరుకుపోయిన పూడికను తీసి నీటి నిల్వ సామర్థ్యంపై దృష్టి పెట్టాలన్నారు. సిద్దేశ్వరం దగ్గర ఒక ఆనకట్టను కడితే శ్రీశైలం ఆనకట్టకు నీటి తాకిడి ఉండదని శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి వెలుగొండ, హంద్రీనీవా, పోతిరెడ్డిపాడు కూడా నీటిని వాడుకోవచ్చన్నారు.

2024 ఎన్నికల్లో పోటీ చేస్తా

రాష్ట్రంలో తనకు ఒక గుర్తింపు ఉందని, తాను ప్రజల మనిషినని, తన పనితనం చూసి టిడిపి, వైసిపిలో ఎవరు పిలిచినా తన వంతు కృషి చేసి ఆ పార్టీకి న్యాయం చేస్తానని గంగుల ప్రతాప్‌రెడ్డి తెలిపారు. 2024 ఎన్నికలలో నంద్యాల ఎంపీ సీటు కేటాయిస్తే పోటీ చేస్తానని, అలా కాని పక్షమున సాధ్యమైనంతవరకు ఆళ్లగడ్డపై బరిలో ఉంటానని, ప్రధాన పార్టీలు తనపై మొగ్గు చూపని పక్షంలో ఇండిపెండెంట్‌గానైనా నంద్యాల లేక ఆళ్లగడ్డ నుండి ఎన్నికల బరిలో ఉంటానని తెలిపారు. 1996లో అప్పటి దివంగత ప్రధానమంత్రి పివి నరసింహారావు కోసం నంద్యాల సీటును వదులుకున్నానని, పాత రోజుల మనిషిని కనుక ప్రజలు తనను ఆదరిస్తారనే నమ్మకంతో ఉన్నానన్నారు.

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి

ప్రజాశక్తి - ఆత్మకూర్

జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య 147వ జయంతి వేడుకలను బుధవారం స్థానిక నలంద హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎం.వి చలపతి పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతీయ పతాక రూపకర్తగా మన రాష్ట్రానికి చెందిన పింగళి వెంకయ్య కావడం రాష్ట్రానికి ఎంతో గౌరవ కారణమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **నంద్యాల :** స్వాతంత్ర సమరయోధుడు, జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య 147వ జయంతి సభ స్థానిక పింగళి సూరన స్మారక శాఖ గ్రంధాలయంలో ఘనంగా జరిగింది. పింగళి వెంకయ్య చిత్రపటానికి రిటైర్డ్ లైబ్రేరియన్ ఎంసివి సుబ్బారావు, కొమ్మా శ్రీహరి పూలమాల వేసి నివాళులు అర్పించారు. గ్రంథాలయం ఇంచార్జ్ ఆర్ఇ శ్రీధర్ మాట్లాడుతూ పింగళి వెంకయ్య గురించి పలు విషయాలు వివరించారు. కార్యక్రమంలో మల్లిఖార్జున, చిలకల సుబ్బారాయుడు, శ్రీనివాస రావు, సురేష్, సుధాకర్, ప్రభాకర్ రెడ్డి, ఆదినారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ సంపూర్ణ పోషణతో రక్తహీనత నివారణ

(5వ పేజీ తరువాయి..) సిడిపిఓ తేజస్విని, అంగన్వాడి సూపర్వైజర్ పార్వతి, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు. **ఆత్మకూరు :** ఆత్మకూరు మండలంలోని అంగన్వాడీ కేంద్రాలలో బుధవారం వైయస్సార్ సంపూర్ణ పోషణ పథకం కార్యక్రమం ప్రారంభించారు. ఆత్మకూరు పట్టణంలోని రహమత్ నగర్ 14, 20, 34 అంగనవాడీ కేంద్రాలలో మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ ఆసియా ప్రారంభించి మాట్లాడారు. ఐసిడిఎస్ సూపర్వైజర్లు విజయ కుమారి, దేవమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు బి.విజయలక్ష్మి, శాంత కుమారి, నీరజ, గర్భవతులు, పాల్గొన్నారు. **కొత్తపల్లి :** కొత్తపల్లిలో ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగేశ్వరమ్మ అధ్యక్షతన ఇంటింటికి వైయస్సార్ ప్లస్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ కుసుమలత, జడ్పిటిసి సోముల సుధాకర్ రెడ్డిలు ప్రారంభించారు. ఎంపీడీవో మేరీ, అంగన్వాడీ సిబ్బంది రవణమ్మ, మరియమ్మ, శేషమ్మ, విజయమ్మ, హరిత, సునీత, నాగమణి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు. **చాగలమర్రి :** చాగలమర్రిలోని మూడవ అంగన్వాడి కేంద్రంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఎంపీపీ వీరభద్రుడు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. అలాగే మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో 5 అంగన్‌వాడీ సెంటర్ల ఆధ్వర్యంలో కిట్లను గ్రామ ఎంపీటీసీ వరికూటివెంకటరాముడు, వైఎస్ఆర్సిపి నాయకులు రెహమాన్, వరికుడి సుబ్బరాయుడులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ, ఐసిడిఎస్ సూపర్వైజర్ సుశీలమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **నంద్యాల రూరల్ :** నంద్యాల మండలం పులిమద్ది గ్రామంలో గర్భిణీ, బాలింతలకు వైయస్ఆర్ సంపూర్ణ పోషణకార్యక్రమాన్ని సర్పంచి రఘురామ్ రెడ్డి ప్రారంభించారు. కమ్యూనిటీ హెల్త్ ఆర్గనైజర్ సుజాతమ్మ, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ఇంజనీర్ హరిప్రసాద్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** బేతంచెర్ల పట్టణం, మండలంలోని సిమెంట్ నగర్, బుగ్గాన పల్లి గ్రామాలలో లబ్ధిదారులకు అంగన్వాడీ టీచర్ల ద్వారా వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. డిప్యూటీ ఎమ్మార్వో సత్యదీప్, డాక్టర్ గాయత్రి, సూపర్వైజర్స్ రాధమ్మ, తిప్పమ్మ, బేతంచెర్ల ఆర్ఐ శ్రీదేవి, నగర పంచాయతీ వైస్ చైర్మన్ బుగ్గానిపల్లి నాగ వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం అమల, సిమెంట్ నగర్ గ్రామ సర్పంచ్ ఎస్తేరమ్మ తదితరులు పాల్గొన్నారు. **పాములపాడు :** ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పాములపాడులో గర్భిణీలకు, బాలింతలకు వైయస్సార్ సంపూర్ణ పోసిన పథకం ప్రారంభ కార్యక్రమాన్ని తాసిల్దార్ రత్నరాధిక, ఎంపీడీవో గోపికృష్ణలు ప్రారంభించారు. ఏపీవో విమలమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జున, హెల్త్ సూపర్వైజర్ గుర్రప్ప, సూపర్వైజర్ లలిత, ప్రభావతి, అంగన్వాడీ టీచర్లు శివలక్ష్మి, నాగమద్దమ్మ, నాగమణి, నాగమ్మ, చెన్నమ్మ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. **రుద్రవరం :** తల్లి బిడ్డకు పాలు పట్టించడం ద్వారా ఆరోగ్యకరంగా ఉంటుందని హెల్త్ సూపర్వైజర్ మిలకమ్మ అన్నారు. రుద్రవరంలోని బెస్త కాలనీలో గల 7,వ అంగన్వాడి కేంద్రంలో పోషక విలువలపై బాలింతలకు గర్భవతులకు అవగాహన కల్పించారు. వైయస్సార్ సంపూర్ణ పోషణ పంపకం కార్యక్రమం, తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా బాలింతలకు ఫేస్ యాప్ (ఎఫ్ఆర్ఎస్)లో నమోదు చేసి పది రకాల పోషక విలువలు ఉన్న పదార్థాలు పంపిణీ చేశారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మీదేవి అంగన్వాడి కార్యకర్త సువర్ణ, వైద్య సిబ్బంది అంగన్వాడీ సిబ్బంది గర్భవతులు తల్లులు పాల్గొన్నారు.


నంద్యాల మండలం పులిమద్ది గ్రామంలో...


ఆత్మకూరులో పంపిణీ చేస్తున్న మున్సిపాలిటీ చైర్మన్ ఆసియా


నందికొట్కూరు : పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆర్థర్


ఆళ్లగడ్డ : పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రా రెడ్డి


రుద్రవరంలో...

రక్తదానం చేసి ప్రాణదాతలుకండి

- రూ. 30 లక్షల విలువైన ఉచిత అంబులెన్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కాటసాని

ప్రజాశక్తి - బనగానపల్లె

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు స్వర్గీయ కాటసాని నాగార్జునరెడ్డి 33వ జయంతి వేడుకలను అవుకు రహదారిలోని నాగార్జునరెడ్డి ఘాట్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ఆయన సతీమణి కాటసాని జయమ్మ, వారి కుమారుడు కాటసాని ఓబులరెడ్డి, నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, ఆయన సతీమణి భూమా ప్రతిభ రెడ్డి, వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గుండం శేషిరెడ్డి, కుటుంబ సభ్యులు, నాయకులు కార్యకర్తలు ఘాటు వద్ద కాటసాని నాగార్జునరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం నాగార్జునరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సొంత నిధులు రూ.30 లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్స్ వాహనాన్ని ఎమ్మెల్యే కాటసాని దంపతులు, వారి తనయుడు కాటసాని ఓబులరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అధిక సంఖ్యలో యువకులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాటసాని నాగార్జున రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బనగానపల్లె పట్టణ ప్రజలు ఎన్నో సంవత్సరాల నుంచి అత్యవసర పరిస్థితుల్లో కర్నూలుకు వెళ్లాలంటే 108 అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆ సమస్య నేటితో కాటసాని నాగార్జున రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచిత అంబులెన్స్ ఏర్పాటు చేసి తీర్చామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో కర్నూలుకు వెళ్లాలంటే 8019198909 నెంబర్‌కు కాల్ చేసిన వెంటనే అంబులెన్స్ వస్తుందన్నారు. కార్యక్రమంలో బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్, ప్రముఖ ఇఎన్‌టి స్పెషలిస్ట్ డాక్టర్ మధుసూదన్ రావు, డాక్టర్ రవికుమార్, గాదంశెట్టి వేణుగోపాల్, మాధవరెడ్డి, ఎర్రగుడి సుబ్బారెడ్డి, కైప ప్రతాప్ రెడ్డి, కాటసాని ఓబుల్ రెడ్డి, యూత్ సభ్యులు, వైఎస్ఆర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే


అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

వాడివేడీగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - మహానంది

మహానంది మండలం బుక్కాపురం గ్రామంలోని పొదుపు కార్యాలయంలో బుధవారం మండల స్థాయి సర్వసభ్య సమావేశం వాడివేడీగా జరిగింది. ఈ సమావేశానికి మండల ఉపాధ్యక్షురాలు కుంచపు లక్ష్మీదేవి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో జనార్దన్ శెట్టి, ఎంపీడీవో శివ నాగ జ్యోతి మాట్లాడుతూ మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలను మండల స్థాయి అన్ని శాఖల అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించాలన్నారు. గ్రామాల సర్పంచులు మాట్లాడుతూ ముఖ్యంగా బుక్కాపురం, అబ్బీపురం గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఎక్కువగా ఉందని తెలిపారు. పొదుపు సంఘం పిఓ మాట్లాడుతూ మండలంలో చాలా గ్రామాల్లో బుక్ కీపర్‌లు పొదుపు సంఘాల లోన్ల మొత్తంలో కొంత వాడుకున్నారని, తిరిగి చాలామంది రికవరీ చేశారని తెలిపారు. గాజులపల్లి ఆర్ఎస్ గ్రామానికి చెందిన బుక్ కీపర్ పొదుపు మొత్తం వాడుకొని రికవరీ చేయకపోవడంతో అతన్ని విధుల నుండి తొలగించామని చెప్పారు. మండల పశువర్ధక శాఖ అధికారి మాట్లాడుతూ మండలంలో తిమ్మాపురం గ్రామంలో ఉన్న పశు వైద్యశాలలో తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని సంబంధిత అధికారులు సమస్యను తీర్చాలని మొరపెట్టుకున్న ఘటన అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఈ క్రాఫ్ట్ బుకింగ్ మొదలైందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో జడ్పిటిసి కెవిఆర్ మహేశ్వర్ రెడ్డి, మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, పంచాయతీ సెక్రటరీలు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ జనార్దన్ శెట్టి

కళ్ల కలక పట్ల జాగ్రత్తలు వహించాలి

ప్రజాశక్తి - ఆత్మకూర్ : కళ్ల కలక విజృంభిస్తున్న క్రమంలో ముందు జాగ్రత్త తీసుకోవాలని బైర్లూటి పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ పవన్ కుమార్ అన్నారు. బుధవారం బైర్లూటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఎపి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలను వైద్య సిబ్బంది సందర్శించారు. విద్యార్థినులను పరీక్షించి అందులో 8 మందికి కళ్ల కలక సోకినట్లు నిర్ధారించి వారికి ప్రత్యేకంగా గదిని కేటాయించి, చుక్కల మందులు, అవసరమగు మందులు అందజేశారు. ఇతర విద్యార్థినులకు సోకకుండా నివారణ చర్యల్లో భాగంగా వారిని ప్రత్యేకంగా ఉంచి చికిత్స అందించారు. కళ్ల కలక సోకిన వారు కళ్ళను పదే పదే రుద్దకూడదన్నారు. తరచుగా గోరు వెచ్చని నీటితో శుభ్ర పరచు కోవాలని, చుక్కలమందు వేసుకోవాలని, ఆరుబయట తిరగరాదని చెప్పారు. కళ్లద్దాలు ధరించాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపల్, టీచర్ సరస్వతి, విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.


దద్దనాల ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్

'దద్దనాల'ను నిర్వీర్యం చేసిన వైసిపి

- మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

రైతులకు ఎంతో ఉపయోగపడే దద్దనాల ఎత్తిపోతల పథకాన్ని వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వీర్యం చేసిందని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి విమర్శించారు. బుధవారం మండలంలోని దద్దనాల (జుర్రేరు) ప్రాజెక్టును, దద్దనాల(జుర్రేరు) ఎత్తిపోతల పథకం ద్వారా నీరు వచ్చే ప్రాంతాన్ని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రూ 21 కోట్లతో బనగానపల్లెలోని ఎస్ఆర్బిసి కాలువ నుండి దద్దనాల ప్రాజెక్టుకు ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. టిడిపి హయాంలో ఏర్పాటుచేసిన ఎత్తిపోతల పథకం ద్వారా నీళ్లు విడిస్తే తనకు పేరు వస్తుందని వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా నీళు వదలడం లేదని విమర్శించారు. దద్దనాల ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 25 అడుగులని, ఎస్ఆర్బిసి కాలువకు నీరు వచ్చే సమయంలో ఎత్తిపోతల పథకం ద్వారా దద్దనాల ప్రాజెక్టుకు నీళ్లు వదిలి 23 నుండి 24 అడుగుల నీటి సామర్థ్యం పెట్టి ఉంటే రైతులకు ఎంతో ఉపయోగంగా ఉండేదన్నారు. పడమటి పల్లెల్లోని రైతులు వర్షాలు కురవక కరువు కాటకాలతో అల్లాడుతుంటే నాడు దద్దనాల ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేశామన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దద్దనాల ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని వదలకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వర్షపు నీటి ద్వారా దద్దనాల ప్రాజెక్టు నిండాలని ఎమ్మెల్యే భావిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే చేతకానితనం వల్లనే దద్దనాల ప్రాజెక్టులో నీరు నిలువ లేకుండా పోయిందని విమర్శించారు. టిడిపి పాలనలోనే నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాయలసీమలోని ప్రాజెక్టుల గురించి పట్టించుకోవడం లేదన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాయలసీమ ప్రాంత ప్రజలకు ద్రోహం చేశారని విమర్శించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో టిడిపి ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టులకు ఎంత ఖర్చు చేశామో, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంత ఖర్చు చేసిందో బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. కార్యక్రమంలో పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి, యాగంటి పల్లె ఉపసర్పంచ్ బండి మౌళీశ్వర రెడ్డి, టిడిపి ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు కృష్ణా నాయక్, బిసి సెల్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దరాజుపాలెం భూషన్న, యాగంటి దేవస్థానం మాజీ చైర్మన్ బత్తుల బాలిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు గంధం హుసేని, టిడిపి నాయకులు శంకేశ్వర రెడ్డి, తలారి తిరుమలయ్య, బద్రి నాగేశ్వరరావు, బాల నాయుడు, కామేష్, షేక్షావలి, రంగస్వామి, శేఖన్న తదితరులు పాల్గొన్నారు

గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - చాగలమర్రి : చాగలమర్రి గ్రామ దేవత చాగలమ్మకు మంగళవారం సమరసత సేవా ఫౌండేషన్ మహిళా సభ్యుల ఆధ్వర్యంలో అధిక శ్రావణ మాసం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఒడిబియ్యం, పారాయణం, కుంకుమార్చణ చేశారు.

పేదల అభ్యున్నతే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

పేదల అభ్యున్నతే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని సంత జూటూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యేకు సహకార సంఘం ఉపాధ్యక్షులు కొంగీస శివశంకర్, భూమా రఘునాథరెడ్డి, దూదేకుల మౌలాలి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం బస్టాండ్‌లో ఎమ్మెల్యే వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఎస్సీ కాలనీ, బీసీ కాలనీల, పాత ఊరులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రతి ఇంటి వద్దకు వెళ్లి వారు పొందిన ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని ఎమ్మెల్యే వివరించారు. శిల్పానగర్‌లో నివాసం ఉంటున్న వారు ఇక్కడ స్థలాలు ఉన్న పట్టాదారులు ఇండ్లు నిర్మించుకోకపోవడంతో పిచ్చి మొక్కలు పెరిగి అడవిని తలపిస్తుందని ఫిర్యాదు చేశారు. వెంటనే తహశీల్దార్‌ను పిలిచి ఇక్కడ ఇల్లు నిర్మించుకొని పాత లబ్దిదారులను రద్దుచేసి కొత్తగా ఇల్లు అవసరమైన వారికి మాత్రమే ఇల్లు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిటిసి చైతన్య, ఏపీసిడిపిఎల్ డైరెక్టర్ డాక్టర్ శశికళ రెడ్డి, శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీపీ దేశువెంకట్రామిరెడ్డి, మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు, దేకిరెడ్డి కృష్ణారెడ్డి, బారెడ్డి అశోక్ రెడ్డి బారెడ్డి, శంకర్ రెడ్డి, డిప్యూటీ తాసిల్దార్ హరిత, వెలుగు ఏపీఎం రాజశేఖర్ రెడ్డి, ఎంపీడీవో వాసుదేవగుప్త, గ్రామ ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.


సంత జూటూరులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే

కుక్కల దాడిలో పది పొట్టేళ్లు మృతి

రూ. 1 లక్ష 30 వేలు నష్టం

ప్రజాశక్తి - పగిడ్యాల

కుక్కల దాడిలో 10 పొట్టేళ్లు మృతి చెందిన ఘటన మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మాపురం గ్రామానికి చెందిన షేక్ హుస్సేనాలం పొట్టేలు పిల్లలను తెచ్చుకుని వాటిని మేపుకొని పెద్దయ్యాక అమ్ముకుని జీవనం సాగించేవాడు. బుధవారం తెల్లవారుజామున పది పొట్టెళు కొట్టంలో ఉండగా కుక్కలు దాడి చేయడంతో మృతి చెందాయి. రూ.1 లక్ష 30 వేలు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం స్పందించి హుస్సేనాలానికి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని స్థానిక ప్రజలు కోరారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - పగిడ్యాల

గర్భిణులు పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని జడ్పిటిసి పుల్యాల దివ్య, సర్పంచ్ పెరుమాళ్ళ శేషన్న, ఎంపీడీవో వెంకటరమణ అన్నారు. బుధవారం పగిడ్యాలలోని అంగన్వాడి కేంద్రం-2లో గర్భిణులకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి తప్పకుండా తమ పేర్లను అంగన్వాడీ కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు. ప్రతినెలా గర్భిణిలకు అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ భారతి, ఎంఈఓ సుభాన్, ఈఓఆర్‌డి నాగేంద్రయ్య, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, గర్భిణులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న దృశ్యం


మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి

- గిరిజన క్రైస్తవులకు రక్షణ కల్పించాలి : ప్రజా సంఘాలు

ప్రజాశక్తి - కొత్తపల్లి

మణిపూర్ రాష్ట్రంలో గిరిజన క్రైస్తవులపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టి, శాంతిని నెలకొల్పి గిరిజనులకు రక్షణ కల్పించాలని ప్రజా సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కొత్తపల్లిలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మణిపూర్ మారణకాండను నిరసిస్తూ స్థానిక గాంధీ విగ్రహం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కెవిపిఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు వి.యేసురత్నం, ఎన్.సంపత్, మాల మహానాడు సీనియర్ నాయకులు గనమల మల్లయ్య, పాతకోట రమేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎన్ స్వాములు, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు బొల్లు ప్రసాద్ బాబు యాదవ్‌లు మాట్లాడారు. కేంద్రంలో, మణిపూర్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిజెపి డబుల్ ఇంజన్ సర్కార్ అక్కడి గిరిజనుల ధన మాన ప్రాణాలకు రక్షణ కల్పించడంలో ఘోరంగా విఫలమయ్యాయని అన్నారు. రెండు గిరిజన తెగల మధ్య చిచ్చుపెట్టి మెజార్టీ వర్గానికి కొమ్ము కాస్తు మైనార్టీ గిరిజనుల పైన దాడులకు ప్రేరేపించిందన్నారు. పార్లమెంటులో ప్రతిపక్ష ఎంపీలు ప్రభుత్వంపైన అవిశ్వాస తీర్మానం పెడితే మన రాష్ట్రంలోని వైసిపి, కాంగ్రెస్, టిడిపి పార్లమెంటు సభ్యులు మద్దతు ఇవ్వకుండా వ్యతిరేకించడం సరైనది కాదన్నారు. ఆంధ్ర రాష్ట్రంలోని అన్ని పార్టీలు మణిపూర్ మారణకాండపై స్పందించి గిరిజనులకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల కార్యకర్తలు నక్క జయన్న, చిమ్మే శంకర్, అన్నలదాసు, ప్రసాద్, శీలం దేవదాసు, ఓబులేసు, స్వాములు, రాజారావు, దేవకుమార్, గోపాల్, దాసు, చిన్న చిన్నయ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు. **శ్రీశైలం ప్రాజెక్ట్ :** మణిపూర్ మారణకాండకు నిరసనగా ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కే.నాగిరెడ్డి ఆధ్వర్యంలో సుండిపెంట స్థానిక స్వామి రెడ్డి భవనం నుండి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కె.నాగిరెడ్డి, సిపిఐ కార్యదర్శి పులిరాజు, సీనియర్ నాయకులు ఓబులయ్య మాట్లాడారు. నాయకులు అనిల్, లక్ష్మీశ్వరుడు, శంకర్, మత్తేషు, అన్వర్ భాష, గురవయ్య, త్రిపురయ్య, హమాలీ వెంకటేశ్వర్లు, గంగాధర్, జాఫర్, కాశి, ఆటో వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, పాపమ్మ, ప్రసాద్ పాల్గొన్నారు.

కొత్తపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు




సుండిపెంటలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

6న జిల్లా స్థాయి ఫుట్ బాల్ జట్ల ఎంపిక

ప్రజాశక్తి - నంద్యాల : రాష్ట్ర ఫుట్ బాల్ అసోసియేషన్ ఆదేశాలతో 13 ఏళ్ల లోపు బాలబాలికల నంద్యాల జిల్లా స్థాయి ఫుట్ బాల్ జట్ల ఎంపిక ఈ నెల 6న నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ జి.రవిక్రిష్ణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కెఈ వినయ్ సాగర్, ఆర్ఓ అనిల్ బాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్రీడాకారులు 2011 జనవరి 1 తరువాత జన్మించి ఉండాలని, ఒరిజినల్ బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్ తీసుకురావాలని సూచించారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు నంద్యాల ఎస్‌పిజి పాఠశాల మైదానంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు హాజరుకావాలని, ఇతర వివరాలకు 9963636876, 9492351316, 79814 07475,99852 20205 ఫోన్ నెంబర్లు సంప్రదించాలని తెలిపారు.

ఎస్‌సి వర్గీకరణే లక్ష్యం : ఎంఎస్ఎఫ్

ప్రజాశక్తి - బేతంచెర్ల : మాదిగల ఆకాంక్ష ఎస్సీ వర్గీకరణ సాధించేందుకు మాదిగలంతా అంతిమ యుద్ధానికి సిద్ధం కావాలని, వర్గీకరణ సాధించే బాటలో ఆగస్టు రెండవ వారంలో హైదరాబాదులో 30 లక్షల మంది మాదిగలతో తలపెట్టిన మాదిగల విశ్వరూప మహాసభకు తరలి వెళ్లి సభను జయప్రదం చేయాలని ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ అనిల్ మాదిగ కోరారు. బుధవారం బేతంచెర్లలోని శ్రీ తేజ జూనియర్ కాలేజ్‌లో మాదిగ విద్యార్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి జిల్లా నాయకులు జెల్లా శ్రీనివాసులు, ఎంఎస్ఎఫ్ నాయకులు వంశి, నితిన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

10న జాతీయ నులి పురుగు నివారణ దినోత్సవం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ : ఈ నెల 10వ తేదిన జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకొని జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉప, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.సుధాకర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలు

ప్రజాశక్తి - నందికొట్కూరు : మండలంలోని మల్యాల గ్రామంలో ప్రస్తుత పంటలలో సమగ్ర సస్య రక్షణ పద్ధతులపై శిక్షణ, మొక్కజొన్న పంట పొలాలను ఆత్మ అద్వర్యంలో అధికారులు క్షేత్ర సందర్శన చేశారు. జిల్లా ఏరువాక కేంద్రం, నంద్యాల ప్రిన్సిపల్ సైంటిస్ట్ (సస్యరక్షణ) రామకృష్ణారావు, జిల్లా వనరుల కేంద్రం డిటిసి, కె.జయదేవ్, ఏడిఏలు మంజువాని, సరళమ్మ, ఆత్మ బిటిఎం ఉమామహేశ్వరి, మండల వ్యవసాయ అధికారి పి.షేక్షావలి, సంయుక్తంగా కలిసి పొలాల క్షేత్ర సందర్శన చేశారు. డిప్యూటీ ట్రైనింగ్ కో ఆర్డినేటర్ జయదేవ్ మాట్లాడుతూ రైతులు జీవ ఎరువులు, జీవ సంబంధ పురుగు మందులు పిచికారి చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపల్ సైంటిస్ట్ రైతులకు వ్యవసాయ సుచనలు, నివారణ చర్యలు వివరించారు.

తల్లి పాల వారోత్సవాలు విజయవంతం చేయాలి

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఆర్.వెంకటరమణ

ప్రజాశక్తి - పాణ్యం : ఈ నెల 1 నుంచి 7 వరకు జరిగే తల్లి పాల వారోత్సవాలు విజయవంతం చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఆర్.వెంకటరమణ తెలిపారు. బుధవారం మండలంలోని మద్దూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఉన్న పాణ్యం 1వ సచివాలయంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా రోగులకు అందుతున్న సేవలు, వారికి కావాల్సిన మందులను పరిశీలించారు.

